# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,గురువారం,
మే 28, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:302

Published from Hyderabad http://epaper.metroevenings.com Metro Evenings Telugu Daily

గురువారం, తేది:28-05-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,అధిక జ్యేష్ఠ మాసం,ఉత్తరాయణం-వసంత రుతువు,బహుళ పక్షం,ద్వాదశి,చిత్ర,వర్జ్యం,ప.3.00 ల 4.43


## ఎండలు ఎక్కువగా ఉన్నాయి.. జాగ్రత్తలు పాటించండి:ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: దేశవ్యాప్తంగా ప్రస్తుతం వేసవి ప్రభావం తీవ్రంగా ఉంది. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. వడగాల్పుల ప్రభావంతో జనం అల్లాడుతున్నారు. దీంతో మరణాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ కూడా వడగాల్పులపై స్పందించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ఈ సందర్భంగా ఓ ట్వీట్ చేశారు. ఇందులో వడగాల్పుల విషయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు.దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు నిరంతరం పెరుగుతున్నాయని, దీనితో పాటు రోజువారీ జీవితంలో వేడి వలన కలిగే అనేక ఇబ్బందులు కూడా పెరుగుతున్నాయని ప్రధాని మోడీ తెలిపారు.

# గాంధీభవన్‌లో రచ్చ..రచ్చ





## గాంధీ భవన్‌లో గొడవ..కొట్టుకున్న నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీహెచ్‌ను నెట్టివేసే యత్నం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): గాంధీ భవన్‌లో నేడు జరిగిన హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతల సమీ సమావేశంలో తీవ్ర గొడవ జరిగింది. ఒకరి నొకరు చొక్కాలు పట్టుకుని నెట్టేసుకోని కొట్టుకోవడంతో సమావేశం రసాభాసగా మారింది.హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ సమక్షంలో గాంధీ భవన్‌లో ప్రారంభమైంది. అయితే, వేదికపై అజహరుద్దీన్ పక్కన కూర్చునే విషయంలో కాంగ్రెస్ నేతలు ఫిరోజ్ ఖాన్,ఉస్మాన్ అల్ హజ్రీల మధ్య మొదట మాటల యుద్ధం నడిచి రణరంగంగా మారింది. నెట్టేసుకోవడం, కిందపడటం ఇరు నేతల మధ్య మాటా మాటా పెరగడంతో అది కాస్తా భౌతిక దాడికి దారితీసింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హజ్రీ తోసేయడంతో ఫిరోజ్ ఖాన్ కిందపడిపోయారు. చొక్కాలు పట్టుకుని ఘర్షణ పడ్డారు దాంతో ఇరు వర్గాల అనుచరులు, నేతలు ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకుని తీవ్రంగా నెట్టేసుకున్నారు. అక్కడే ఉన్న సీనియర్ నేత ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు గొడవను సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా,ఆయనను కూడా కొందరు తోసేసేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.నేతల ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అజహరుద్దీన్ సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయారు. పరిస్థితి చేయి దాటడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాల్లో వరుసగా ఇలాంటి ఘర్షణలు చోటుచేసు కోవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

**తెలంగాణా రైతాంగం ఆందోళన చెందొద్దు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తామని ,రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు.నిఅకాల వర్షాలకు తడిసిన 9,214 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అకాల వర్షాలు సంభవించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉత్పన్నమయిన పరిణామాలను సమీక్షించేందుకు గాను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యవసరంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రివర్గ సహచరులు, రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు,పోలీస్ అధికారులు, రవాణా శాఖాధికారులు, పౌర సరఫరాల శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యలను ప్రభుత్వం చూస్తూ ఊరుకొబోదన్నారు.

## సర్ సరైనదే

**సమర్థించిన సుప్రీం కోర్టు**

ఢిల్లీ (మెట్రోన్యూస్): ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు బుధవారం సంచలన తీర్పునిచ్చింది.సాధారణ సవరణ విధానానికి భిన్నంగా ఉందనే ఒకే ఒక్క కారణంతో ఈ ప్రత్యేక ప్రక్రియను రద్దు చేయలేమని స్పష్టం చేసింది. మే 30 నుంచి దేశవ్యాప్తంగా మూడో విడత సవరణలు ప్రారంభం కానున్న తరుణంలో అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించు కుంది.

**ఈసీ అధికారాలపై కోర్టు ముద్ర**

చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326తో పాటు 1950 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఈ తరహా ప్రత్యేక సవరణలు చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి ఉందని కోర్టు స్పష్టం చేసింది.

## మహిళల చేతికి సోలార్ పవర్

**ఎర్రుపాలెంలో రూ. 3 కోట్ల సోలార్ ప్లాంట్ ప్రారంభం**



మధిర (మెట్రో న్యూస్): మహిళల ఆర్థిక స్వవలంబన ఒక చారిత్రక అడుగు అని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. బుధవారం నాడు ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలంలో వెంకటాపురం గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళ స్వయం సహాయక సంఘాలకు సంబంధిం చిన సోలార్ పవర్ ప్లాంట్ను మంత్రి సీతక్కతో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులతో సోలార్ పవర్ ప్రాజెక్టులు నిర్మించి,వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు.నినిఎర్రుపాలెం మండలం వెంకటాపురంలో మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించడం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఈ సోలార్ ప్లాంట్ ద్వారా మహిళా సంఘాలకు రోజుకు రూ. 14,000 నుంచి రూ.15,000 వరకు అంటే నెలకు సుమారు రూ. 4.5 నుండి 5 లక్షల వరకు ఆదాయం లభిస్తుందని తెలిపారు.

## ఎబోలా ముప్పు

## భారత్‌లో లేదు.. కానీ నిఘా తీవ్రం!



ఇంటర్నెట్ డెస్క్: ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తున్న ఎబోలా వైరస్ మహమ్మారిపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశంలో అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో నిఘాను తీవ్రం చేసింది. విమానాశ్రయాలు, సరిహద్దుల్లో తనిఖీలను పటిష్ఠం చేసింది. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కేంద్ర ఆరోగ్య శాఖ భరోసా ఇచ్చింది.

**బెంగళూరులో అనుమానిత కేసు నెగెటివ్**

ఇటీవల ఉగాండా నుంచి కర్ణాటకకు వచ్చిన ఓ వ్యక్తికి ఒళ్లు నొప్పులు రావడంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా బెంగళూరులో ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను పూణెలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. ఆ పరీక్షల్లో అతనికి ఎబోలా నెగెటివ్ అని తేలడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆఫ్రికా నుంచి వచ్చారనే కారణంతోనే ఈ ముందస్తు పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు స్పష్టం చేశారు.

## విమాన సేవల్లో ఎయిరిండియా కోత




ఢిల్లీ (మెట్రోన్యూస్): జులై, ఆగస్టు నెలల్లో ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించాలనుకునే వారికి కొన్ని రూట్లలో ఆప్షన్లు తగ్గనున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ సర్వీసులను కుదించిన విషయం తెలిసిందే. ఇప్పుడు దేశీయ విమాన సర్వీసులను కూడా తగ్గించాలని సంస్థ నిర్ణయించింది. విమాన ఇంధన ధరలు భారీగా పెరగడమే ఇందుకు కారణమని విమానయాన వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా విమాన ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో ఎయిరిండియా జులై, ఆగస్టు నెలల్లో తన దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఏ రూట్లను పూర్తిగా రద్దు చేయకుండా కేవలం విమానాల ఫ్రీక్వెన్సీని మాత్రమే తగ్గించాలని సంస్థ భావిస్తోంది.

## బాల్క సుమన్ వ్యాఖ్యల దుమారం

**డీజీపీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ విధ్వంసకర వ్యాఖ్యలన్న బీజేపీ**



హైదరాబాద్ (మెట్రో న్యూస్): బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం రేగుతోంది. మంగళవారం సింగరేణి కార్మికుల సమావేశంలో ఆఫీసులు తగులబెట్టండి... రైలు పట్టాలు కోసేయండి... మిలిటెంట్ తరహా పోరాటాలు చేయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టుగా వార్తలొచ్చాయి. దీనిపై అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది.

## తుమ్మడి హట్టిపై చర్చించేందుకు సిద్ధం

**మహారాష్ట్ర సీఎంకు రేవంత్ లేఖ**



హైదరాబాద్ (మెట్రో న్యూస్): తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నాడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని మహారాష్ట్ర సీఎంను కోరారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజ్ 152 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్నారు. 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని కూడా మహారాష్ట్ర అప్పట్లో తెలిపింది. ఇటీవల ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని పున: సమీక్షించింది.

మెట్రో ఈవినింగ్స్

2

హైదరాబాద్,

గురువారం

మే 28 , 2026

# సీఎం రేవంత్ బక్రీద్ శుభాకాంక్షలు

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** త్యాగనిరతి, దైవభక్తికి ప్రతీక గా జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం చేయడానికి సిద్ధపడిన గొప్ప సంఘటనను స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని సీఎం గుర్తు చేశారు. బక్రీద్ పండుగ మనిషికి త్యాగం, దాతృత్వం, విశ్వాసం, మానవత్వం వంటి గొప్ప విలువలను గుర్తుచేస్తుందని అన్నారు. జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా దేవుడిపై నమ్మకంతో సన్మార్గంలో ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తోందని తెలిపారు. తమకు ఉన్నదాంట్లో కొంతైనా అవసరమైన వారికి పంచిపెట్టడం కన్నా గొప్ప దానం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ ప్రపంచానికి చాటిచెబుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# చేతగాని ప్రభుత్వం ఇది రైతులను అరిగోస పెడుతున్నారు

**- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్ (మెట్రో న్యూస్):** నెల రోజులుగా మొత్తుకుంటున్నా వడ్లు కొనకుండా రైతులను అరిగోస పెడుతున్నారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. సీఎం, మంత్రులు, అధికారుల మధ్య సమన్వయమే లేదన్నారు. తలో మాట చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారని వ్యాఖ్యానించారు. బుధవారం కరీంనగర్‌లోని బొమ్మకల్ ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మంత్రికి తడిసిన వడ్లను చూపించి రైతులు వాపోయారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేంద్రమంత్రి రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమిది అన్నారు. తడిసిన ధాన్యం పేరుతో పెద్ద ఎత్తున కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారు. తెలంగాణ వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడే దుస్థితి. పంట నష్టపోతే పరిహారమిచ్చే దిక్కు లేదు. పండించిన వడ్లను కొనకపోతే... రైతులకు ఇంకేం మేలు చేస్తారు? నెలాఖరు వరకు వడ్ల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తే దేనికైనా సిద్ధం. వడ్ల పైసలన్నీ కేంద్రమేఇస్తుంటే కొనుగోలు చేయడానికి మీకేం ఇబ్బంది? అసలు వడ్లను కొంటారా? లేదా? చేతగాకపోతే అదే విషయాన్ని కేంద్రానికి సీఎం లేఖ రాయాలని సూచించారు.

# రైతన్నలకు అండగా నిలవాలి బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన కేటీఆర్. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రైతు కంటతడి పెడితే ఏ ప్రభుత్వానికీ మనుగడ ఉండదు అని పేర్కొన్న కేటీఆర్.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# శాతవాహన యూనివర్సిటీ అప్షన్ తీసుకోండి విద్యార్థులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి




**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** సకల సౌకర్యాలతో ఉన్న హుస్నాబాద్ శాత వాహన యూనివర్సిటీ కాలేజీ అప్షన్ తీసుకోవాలని బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం సచివాలయంలో ఆయన శతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ రిజిస్ట్రార్ సతీష్ కుమార్ లతో కలిసి మీడియా సమావేశం లొ మాట్లాడారు.తెలంగాణ ఎంసెట్ రాసిన విద్యార్థిని విద్యార్థులు శాత వాహన యూనివర్సిటీలో అప్షన్ తీసుకోవాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో సీఎం రేవంత్ రెడ్డి నెత్రుత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం హుస్నాబాద్ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్యను అందించేందుకు శాత వాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేశారని తెలిపారు. రాష్టంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ లు 22వరకు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.హుస్నాబాద్ యూనివర్సిటీలో ప్రైవేట్ కాలేజీలకు దీటుగా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు. కాలేజీ శాశ్వత భవనాలు ప్రారంభయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు మొదటి సంవత్సరంలో సదుపాయాలు ఉండవన్న అపోహ తల్లి దండ్రులకు విద్యార్థిని విద్యార్థులకు అవసరం లేదని మంచి వసతి కలిగిన పాలిటెక్నిక్ కాలేజీ లొ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి సంవత్సరం వేరు వేరు హాస్టల్ వసతి సౌకర్యాలు కల్పించినట్టు ఆయన పేర్కొన్నారు. రవాణా సౌకర్యాలకు సైతం ఇబ్బందులు లేవన్నారు. కాలేజీ హుస్నాబాద్ పట్టణంలోనే ఉందన్నారు. ప్లేస్ మెంట్స్, కేరిర్ గైడెన్స్ అవకాశాలతో యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు కల్పిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఉత్తర తెలంగాణ ప్రాంత అభివృద్ధికి శతవాహన యూనివర్సిటీ మైలు రాయిగా నిలుస్తుందని తెలిపారు. కాలేజీ విద్యార్థులకు సైకిళ్ల పంపిణి పుస్తకాలు క్యాలీక్ లేటర్ పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు 26,27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు కరీంనగర్, జనగామ, సిద్దిపేట, హనుమకొండలకు మధ్యలో హుస్నాబాద్ లొ కాలేజీ అందుబాటులో ఉందని తెలిపారు. మొదటి సంవత్సరంలో సీఎస్సీకి 60,సీఎస్సీ ఏఐకి 60సీట్లు ఈసీఈ కి 60,ఐటీ కి 60, బయోటెక్నాలజీ 60,బీ టెక్ ఐదు కోర్స్ లకు సం బందించి 60సీట్ల చొప్పున 300సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు ప్రైవేట్ తరహాలో బ్రోచర్ ఆవిష్కరణ హుస్నాబాద్ శాత వాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీపై మంత్రి పొన్నం ప్రభాకర్ విన్నుత్న ప్రచారం చేశారు. కాలేజీ అడ్మిషనలపై ఆయన మీడియా ద్వారా ప్రచారం చేశారు. ప్రైవేట్ కాలేజీల తరహాలో బ్రోచర్‌లు ఆవిష్కరించారు.

# మహిళల అభివృద్ధి కొరకు సంఘాల బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**- యాచారం ఎంపీడీవో రాధా రాణి**



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** నియోజకవర్గంలోని యాచారం మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాధా రాణి అన్నారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ఐకెపి భవనంలో మహిళా సమైక్య సర్వసభ్య సమావేశాన్ని డిఆర్పిఓ జోజప్ప, నిర్వహించారు. మండల సమైక్య ఆర్థిక లావాదేవీల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో రాధా రాణి, హాజరై మాట్లాడారు..మహిళలు రుణ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం ద్వారా మరిన్ని రుణాలు పొందవచ్చు అని సూచించారు. బాలికల కోసం రూపొందించిన ఫోక్సో చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం, రవీందర్, సూపర్వైజర్ సరళ, ప్రేమలత, ఈశ్వరమ్మ, ఈసీ మెంబర్లు, సీసీలు పాల్గొన్నారు.

# కోహెడ భూములను అన్యాయంగా లాక్కుంటున్నారు



**మెట్రోన్యూస్, ఇబ్రహీంపట్నం:** కోహెడ సర్వేనెంబర్ 167/1 లో ఎస్సీ, బీసీలకు సంబంధించిన 260 ఎకరాల భూమిని రైతుల దగ్గర అన్యాయంగా లాక్కొని మార్కెట్ ఏర్పాటు చేస్తున్నారని కోహెడ భూబాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోహెడ లో భూ బాధితులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన హై కోర్టు న్యాయవాదులు మహమ్మద్ హుస్సేన్, నసీబ్ లు మాట్లాడుతూ కోహెడ గ్రామంలో గత 70 సంవత్సరాలుగా రైతులు ముత్తాతల నుంచి భూమినీ సాగు చేసుకుంటున్నారని ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నామని పోలీసు బలగాలతో మా పేదల భూములను బలవంతంగా లాక్కోవడం అన్యాయమనికోహెడ రైతులుఆవేదనవ్యక్తం చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు సాదు రాములు, సాదు యాదగిరి, సాదు కృష్ణ, బుడ్డ జంగయ్య, బుడ్డ ఆగమయ్య, సాదు మహేష్, సాదు దానయ్య, పంది సతీష్, శీలం అంగత్, రైతులు పాల్గొన్నారు.

# మొక్క జొన్న సాగు కొనుగోలులో చరిత్ర :మంత్రి తుమ్మల



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మునుపెన్నడూ లేని విధంగా ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ రైతులు మరియు తెలంగాణ ప్రజా ప్రభుత్వం కలిసి మొక్కజొన్న సాగు, కొనుగోలు రంగాలలో చరిత్ర సృష్టించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు కనివిని ఎరుగని రీతిలో సుమారు 16 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేసి రాష్ట్ర వ్యవసాయ చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లభించేలా ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని మంత్రి తెలిపారు. మొక్కజొన్న రైతులకు సంబంధించి లక్ష మంది రైతుల ఖాతాలలో రూ.1173 కోట్లను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తాన్ని రైతుల ఖాతాలలో నేరుగా జమ చేయనున్నట్లు చెప్పారు. ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 338 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 13.42 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను 2.42 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కొనుగోళ్ల కోసం ఇప్పటికే రూ.3757 కోట్లను ఖర్చు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోలు చేయడం ఇదే తొలిసారని స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో వెనుకంజ వేసిన పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం కూడా మొక్కజొన్న కొనుగోలు చేయమని చేతులు ఎత్తేసిన సమయంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులకు భరోసాగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. రైతులు మద్దతు ధర లేక నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రంలో పండిన మొక్కజొన్న పంట మొత్తాన్ని మద్ధతు ధరతో కొనుగోలు చేయాలని నిర్ణయించారని తెలిపారు.రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడా నిల్వ సమస్యలు తలెత్తకుండా, వేగంగా తరలింపు మరియు భద్రపరిచే చర్యలను ప్రభుత్వం సమర్థవంతంగా చేపట్టిందని వివరించారు.తెలంగాణ రైతాంగానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తూ, సాగు నుంచి విక్రయం వరకు రైతులకు పూర్తి భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రైతుల కష్టానికి గౌరవం దక్కేలా, పంటకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్ గారు, మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్ గారు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి గారు తదితర అధికారులు పాల్గొన్నారు.

# సమిష్టితో మంచి ఫలితాలు అబ్కారీ అధికారుల సంయుక్త దాడులు

- ముప్పేట,దాడులు తనిఖీలు
- నాటుసారా తయారీపై ప్రత్యేక దాడులు..
- బార్ల నిర్వాహణపై స్పెషల్ ఫోకస్..
- కెమికల్ తయారీ కంపెనీల తనిఖీలు
- గంజాయి..డ్రగ్స్ నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్ పై నిఘా..

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** సమిష్టి పని తీరుతో మంచి ఫలితాలు అందిస్తాయని అబ్కారీ అధికారులు నిరూపించారు.ఎక్సైజ్ శాఖ, ఎస్టీఎఫ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, డ్రగ్ కంట్రోల్ ఆథారిటి కలిసి సంయుక్తంగా చేసిన దాడులు మంచి ఫలితాలనిచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ రెవెన్యూ కార్యదర్శి రఘునందన్‌రావు,ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ డిప్యూటి కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు ఈఎస్‌లతో పాటు ఎక్సైజ్ శాఖకు కొత్తగా వచ్చిన ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతిటాస్క్‌ఫోర్స్ టీమ్‌లతో ప్రత్యేక సమీక్షా నిర్వహించారు తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిపై ఉక్కు పాదం మోపాలనే అదేశాలు, వీటికి తోడు ఎక్సైజ్ రెవెన్యూకు విఘా తం కల్పిస్తున్న నేరాలపై ఉన్నతాధికారులు సమీక్షాలో చర్చలు జరిపారు. ఉన్నతాధికారుల అదేశాలతో ఎక్సైజ్ స్టేషన్లు, ఎస్టీఎఫ్, ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్‌లు, డీటీఎఫ్ టీమ్‌లు ఎన్ఫోర్స్మెంట్ జాయింట్ డైరెక్టర్ కమిషనర్ అంజన్‌రావు పర్యవేక్షణలో ముప్పేటదాడులు, ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.నాటుసారా తయారీపై ప్రత్యేక దాడులు.చేశారు నాటుసారాపై ఈ నెలలో ప్రత్యేక ఫోకస్ చేశారు. చాల జిల్లాల్లో నాటుసారా తయారీ అమ్మకాలు, రవాణ లేవు. కొన్ని జిల్లాల్లో మాత్రం అక్కడక్కడ తండాలు, ఇతర మారుమూల ప్రాంతాల్లో తయారవుతున్న నాటుసారాను అరికట్టడానికి ఎక్సైజ్ స్టేషన్లతోపాటు స్థానికి ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ టీమ్‌లతోపాటు ఈ సారి ప్రత్యేకంగా ఎస్టీఎఫ్ టీమ్‌లు రంగంలోకి దాడులను ముమ్మరం చేశారు.నాటుసారా ప్రధానంగా మహబూబ్‌నగర్, అదిలాబాద్, వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టిదాడులు నిర్వహించారు.మరికొన్ని ప్రాంతాల్లో తయారవుతున్న నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు.గత 20 రోజుల్లో 1218 కేసులునాటుసారా తయారీదారులపై , రవాణ, అమ్మకందార్లపై కేసులు నమోదు చేశారు. 4643 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 69,220 బెల్లం పానకాన్ని నేలపాలు చేశారు. 45,994 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. సింథటిక్ డ్రగ్స్ తయారీ, మత్తును కలిగించే ఇంజక్షన్లు, కల్తీ కల్లు తయారీకి వినియోగించే ఆల్ప్రోజోలం, వీటితో పాటు ప్రమాదకరమైన పెయింటనిల్, మేఫెడ్రోన్ మందుల తయారీ, వినియోగం, అమ్మకాలపై పరిశీలనకు డీసీఏ నుంచి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్లు కలిసి పలు పార్మ అండ్ కెమికల్ కంపెనీల్లో అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సుమారు 15 కంపెనీల్లో అడుగడుగన తనిఖీలు నిర్వహించారు. కెమికల్ కంపెనీల్లోను, మత్తు మందులనుఅమ్మకాలుజరిపేకంపెనీల్లో ప్రత్యేకతనిఖీలుగుబుల్ పుట్టించాయి. హైదారబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లో ఎక్కువగా బార్లు ఉన్నాయి. ఈ బార్లు నిబంధలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఎస్టీఎఫ్ టీమ్‌లు ఈ నెల 12 నుంచి దాడులు నిర్వహించి 47 బార్లపై తనిఖీలు నిర్వహించారు.ఫిర్యాదులమేరకు వారిపై పలు రకాల చర్యలకు నివేదికలు ఇచ్చారు. మరోపక్కనిత్యంఎస్టీఎఫ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు తమ దాడుల్లో భాగంగా ఢిల్లీ, గోవా, హర్యానా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చె ఎన్ (నాన్‌డ్యూటిపెయిడ్ లిక్కర్,) డిఫెన్స్ లిక్కర్, మిక్సింగ్ లిక్కర్‌ను తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో 556.02 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యంతోపాటు 244 కేజీల గంజాయిని, ఎండీఎంఏ, ఇతర డ్రగ్స్‌ను పట్టుకున్నారు.

# రైతు సమస్యలపై రాజకీయాలు చేయొద్దు : రైతు కమిషన్



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకొని ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని రైతు కమిషన్ సూచించింది. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషన్ ఛైర్మన్ కొదండరెడ్డి, సభ్యులు గిడుగు గంగాధర్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి కలిసి మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని రోజులుగా వడ్లు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోందని కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. రైతులకు బాసటగా నిలబడాల్సిన నాయకులు వారిని మానసికంగా దెబ్బతీసేలా, రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదన్నారు.బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, మద్దతు ధరల వ్యవస్థలో ఉన్న 23 పంటల కొనుగోళ్ల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ జరుగుతుండగా, ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొనుగోలు వ్యవస్థలు బలహీనపడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో వరి, పత్తి పంటలు అధికంగా సాగు చేస్తున్నారని, పత్తి కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించి ఎకరానికి ఏడు క్వింటాళ్లే కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులకు నష్టం కలిగించిందన్నారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరగాల్సిన బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని స్పష్టం చేశారు.రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 57 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. 2014 నుంచి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ రైతు సమస్యలు పెరిగాయని విమర్శించారు. రైతుల ఆదాయం పెరిగే విధంగా పంటల వైవిధ్యీకరణపై ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కోదండరెడ్డి తెలిపారు.రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మాట్లాడుతూ రైతులతో కలిసి ఉండాల్సిన వారు యాత్రల పేరుతో రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమైనా, దానిని మొత్తం రాష్ట్ర సమస్యగా చూపించడం వాస్తవాలకు విరుద్ధమన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, జిల్లా అధికారులు, సివిల్ సప్లై శాఖ సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. లారీల కొరత ఉన్న చోట్ల ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు.రైతులు అపోహలకు లోనుకాకుండా వాస్తవ పరిస్థితులను గమనించాలని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.



## మళ్లీ మొదటికొచ్చిన
# కాంగ్రెస్ లుకలుకలు!

**మీడియాకు లీకులు, నెగెటివ్ స్టోరీలు ఇది కొత్తేమీ కాదు. కాంగ్రెస్ పార్టీలో అనాదిగా వస్తున్న సంప్రదాయమే. అందరికీ తెలిసినట్టుగానే ఆ పార్టీలో ంతర్గత ప్రజాస్వామ్యం అధికంగా ఉంటుంది. ఒకరి పొడ ఒకరికి గిట్టదు. .కరు ఎదిగితే ఇంకొకరు తట్టుకోలేరు. స్థూలంగా చెప్పాలంటే పరమపద సోపానం అనేది కాంగ్రెస్ పార్టీలో అణువణువు కనిపిస్తూనే ఉంటుంది. ్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో కొత్తగా మారింది లేదు. కొత్తగా ఆ పార్టీలో అలవడిన క్రమశిక్షణ కూడా లేదు.**

## ఒకరిపై ఒకరు లీకుల జోరు నెగెటివ్ స్టోరీల హోరు

హైదరాబాద్ (మెట్రోన్యూస్): ఇటీవల పీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మీద బిగ్ టివి ఛానల్ లో వ్యతిరేక కథనాలు ప్రసారమయ్యాయి. ఈ ఛానల్ ముఖ్యమంత్రి కి అత్యంత దగ్గరగా ఉన్న వ్యక్తులదని తేలింది. కాంగ్రెస్ పార్టీకి బిగ్ టివి మొదటినుంచి కూడా సపోర్ట్ చేసుకుంటూ వస్తోంది. ఒక్క నెగిటివ్ స్టోరీ కూడా అందులో పబ్లిష్ కాలేదు. పబ్లిష్ అయ్యే అవకాశం కూడా లేదు. అయితే ఉన్నట్టుండి ఆ ఛానల్ లో మహేష్ కుమార్ గౌడ్ మీద నెగిటివ్ స్టోరీలు టెలికాస్ట్ కావడం నిజంగానే సంచలనం కలిగించింది.

మహేష్ కుమార్ గౌడ్ వ్యవహార శైలి మీద బిగ్ టీవీ అలాంటి స్టోరీలు టెలికాస్ట్ చేయడం నిజంగానే ఒక రకమైన దిగ్భ్రాంతిని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో కలిగించింది. అసలు మహేష్ కుమార్ గౌడ్ కు.. బిగ్ టి వి యాజమాన్యానికి ఎక్కడ తేడా వచ్చిందో అర్థం కావడం లేదు.. తెర వెనుక ఎలాంటి వివాదాలున్నా సరే.. తెర ముందు ఇలా బిగ్ టీవీ చేస్తుందని ఎవరూ అంచనా వేయలేదు. ఇప్పుడు మహేష్ కుమార్ గౌడ్ వర్సెస్ బిగ్ టివి యాజమాన్యానికి పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇది ఎక్కడ దాకా వెళ్తుంది.. ఎంత దాకా దారి తీస్తుందనేది చూడాల్సి ఉంది.

ఆమధ్య భట్టి విక్రమార్క మీద ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణ తన కొత్త పలుకులో బొగ్గు గనుల కేటాయింపు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై విక్రమార్క తెర ముందుకు వచ్చారు. ఆయన కూడా తనదైన స్టైల్ లో రాధాకృష్ణ మీద విమర్శలు చేశారు. దీనికంటే ముందు ఎన్టీవీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఒక కలెక్టర్ మధ్య సంబంధం ఉన్నట్టు న్యూస్ టెలికాస్ట్ అయింది. దాని మీద ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రస్థాయిలో మండిపడింది..

కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీద ఆ ఛానల్ ఆ స్థాయిలో నెగిటివ్ స్టోరీ పబ్లిష్ చేయడానికి బొగ్గు గనుల కేటాయింపు ప్రధాన కారణమని ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణ సరికొత్త బాంబు పేల్చారు.. ఎన్ టీవీ చైర్మన్ నరేంద్ర చౌదరి అల్లుడు.. భట్టి విక్రమార్క కలిసి మైనింగ్ వ్యవహారం చేస్తున్నారని.. దానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డుపడుతున్నారని.. అందువల్లే ఆయన మీద ఎన్టీవీలో స్టోరీ పబ్లిష్ చేసినట్టు రాధాకృష్ణ చెప్పుకొచ్చారు.

వాస్తవానికి మీడియా వాస్తవాలను మాత్రమే ప్రసారం చేస్తే ఇంత చర్చ ఉండేది కాదు. మీడియా అనేది రాజకీయ పార్టీకి తొత్తుగా మారిపోయిన తర్వాత.. కేవలం రివేంజ్ తీర్చుకునే వ్యవస్థ గానే అది రూపాంతరం చెందింది. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మీడియా కాస్త హద్దుల్లో ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీడియా వ్యక్తిగత దాడులకు మాత్రమే ఉపకరించే వ్యవస్థగా దిగజారిపోయింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెద్ద వ్యక్తుల చేతుల్లో పరోక్షంగా కొన్ని మీడియా సంస్థలు ఉన్నాయి. అవి ఇష్టానుసారంగా కథనాలను ప్రసారం చేస్తున్నాయి. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ మరింత దారుణంగా అభాస పాలవుతోంది. ఫలితంగా పదేళ్లపాటు అధికారం కోసం ఎదురుచూసిన ఆ పార్టీ.. ఇప్పుడు ఉన్న అధికారాన్ని నిలబెట్టుకునే పరిస్థితి కూడా కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.ఒకరికి తెలియకుండా మరొకరు మీడియాకు లీకులు ఇచ్చుకోవడం వల్ల కాంగ్రెస్ పార్టీ పరువు బజారున పడుతోందని.. అపార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇంతటి దుస్థితిలో కూడా కాంగ్రెస్ పార్టీకి ఒక లాభదాయకమైన అంశం చోటు చేసుకుంటున్నది. అదేంటంటే క్షేత్రస్థాయిలో భారత రాష్ట్ర సమితి బలంగా లేదు కాబట్టి కాంగ్రెస్ పార్టీకి కాస్తలో కాస్త బెటర్ పొజిషన్ కనిపిస్తోంది. ఒకవేళ భారత రాష్ట్ర సమితి గనుక బలంగా ఉండి ఉంటే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి వేరే విధంగా ఉండేది. ఇప్పటికైనా ఆ నాయకులు మారాలని.. సమిష్టిగా పార్టీ విజయం కోసం కృషి చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.



## గ్రేటర్‌లో లక్ష ఇండ్లకు శ్రీకారం

### స్థలాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రేటర్ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిఅల్పాదాయ వర్గాలకు ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణం కోసం అనువైన స్థలాల అన్వేషణ మొదలైంది. రాష్ట్ర హౌసింగ్‌నిమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం పాతబస్తీ నియోజకవర్గాలలో స్థలాలను పరిశీలించారు. మంత్రి అజహరుద్దీన్, మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి నాంపల్లి, మలక్‌పేట్, బహదూర్‌పురాలో నియోజకవర్గాలలో పర్యటించారు. కుల్సుంపురా, అఫ్జల్ సాగర్ ప్రాంతాలలో అందుబాటులో ఉన్న స్థలాలను చూశారు. అలాగే కాలడేరా, గడ్డియన్నారంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని... తొలి విడతలో గ్రేటర్‌లో లక్ష ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా తెలిపారు.



## అట్టహాసంగా ప్రారంభమైన మహానాడు

అమరావతి (మెట్రోన్యూస్): తెలుగుదేశం పార్టీ వార్షిక మహాసభ 'మహానాడు-2026' అమరావతిలో అట్టహాసంగా ప్రారంభమైంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారు పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి.

వర్చువల్‌గా కార్యకర్తలతో మమేకం

ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తుండటం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1875 క్లస్టర్లకు గాను 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ (స్క్రీన్లను ఏర్పాటు చేసి, కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

## 1000 కోట్లకు పైగా కొకైన్ సీజ్!

ఇంటర్నెట్ డెస్క్: మాదకద్రవ్యాల రవాణాపై కేంద్రం ఉక్కుపాదం మోపింది.తాజాగా గుజరాత్‌లోని కచ్ తీరంలో భారీ మొత్తంలో కొకైన్ దొరికింది.దాని విలువ రూ.1000 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.పాకిస్థాన్‌లోని ఖాసిం పోర్టు నుంచి ఒక యూరోపియన్ నౌక కచ్ తీరానికి వచ్చింది. ఈ నౌకలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్), భారత కోస్టార్డ్ అధికారులు గమనించారు. నౌకలోంచి కొన్ని సంచులను సముద్రంలోకి విసిరేయడాన్ని గుర్తించారు. దీంతో వెంటనే అధికారులు రంగంలోకి దిగి ఆ సంచులను స్వాధీనం చేసుకొని.. పరీక్షించగా అవి కొకైన్ అని తేలింది. దాదాపు 100 కిలోలకు పైగా కొకైన్ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.1150 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ డ్రగ్స్ రవాణాకు సంబంధించి ఒకరిని అధికారులు అరెస్టు చేశారు. నౌకనన్ను సీజ్ చేసి తీర ప్రాంతానికి తరలించారు. ఈ డ్రగ్స్ ఎక్కడినుంచి వచ్చాయి,

## ధాన్యం కొనుగోళ్ల
# వేగం పెంచండి



**ఆరెంజ్ అలెర్ట్ నేపథ్యంలో సీఎం ఆదేశాలు**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కల్లాల్లోని ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తైన కేంద్రాల నుంచి టార్పాలిన్లను తరలించాలని అన్నారు.బలమైన ఈదురు గాలులు వీస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు

## కేంద్రమే డబ్బులిస్తోంది

### ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

హైదరాబాద్ (మెట్రో న్యూస్):రాష్ట్రంలో జరుగుతున్న పూర్తి వరి ధాన్యం కొనుగోళ్ల నిధులను కేంద్రమే రీఇంబర్స్ చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కళ్లకు గంతలు కట్టుకుని కేంద్రం ఏమీ ఇవ్వలేదని అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు చివరి గింజ వరకు కొంటాం అని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు రైతులను ఎందుకు రోడ్డున పడేశారని ఆయన ప్రశ్నించారు. అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు లేవని, గోదాముల వసతి లేదని, కొనుగోళ్లు సరిగ్గా జరగడం లేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మండిపడ్డారు.



### కేరళ మాజీ సీఎం పినరయి ఇంట
## ఈడీ సోదాలు

ఇంటర్నెట్ డెస్క్: మనీ లాండరింగ్ కేసులో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 కీలక ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు జరుగుతుండడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది.

# రెక్కల కష్టం నీళ్ల పాలు





హైదరాబాద్ (మెట్రో న్యూస్): రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. కనికరం లేని కాంగ్రెస్ పాలనలో అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంమవుతున్నారు. ప్రభుత్వ సహకారం లేకున్నా తన స్వేధంతో సేద్యం చేసిన రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పసిడి సిరులను పండిస్తే కాంగ్రెస్ నిర్లక్ష్యం, రైతుల పట్ల చిన్న చూపుతో తీవ్రంగా నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దవుతున్నాయి.

సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఉసురు తీసుకునే ఏ ప్రభుత్వం కూడా బాగుపడదని శాపనార్ధాలు పెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

# కాలుష్య నివారణకే ఎలక్ట్రిక్ బస్సులు





### 60 బస్సులు జెండా ఊపి ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్ నగరంలో కాలుష్యం తగ్గించాలనే ఆలోచనతో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతు న్నామ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఒక సదుద్దేశ్యంతో ఈ బస్సులను మొదలు పెట్టాం... ప్రస్తుతం 960 ఎలెక్ట్రిక్ బస్సులను నడిపిస్తునం... ఇంటర్ సిటీ కింద 580 బస్సులున్నాయ్... 3000 బస్సులను నడిపితే 600 టన్నుల కార్బన్ ఉదరాలను తగ్గించొచ్చు... హైదరాబాద్ మరో డిల్లీ కాకూడదని ఈవీ వాహనాలను తీసుకురావడం జరుగుతోందన్నారు. బుధవారం కూకట్‌పల్లి డిపోలో 60 విద్యుత్ బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నికార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్, ఆర్టీసీ ఎం.డి నాగి రెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిలు పాల్గొన్నారు. నినిఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పెట్రోల్ డీజిల్ ధరలు ప్రజా రవాణాపై ఎంత ప్రభావం పడుతుంధో అందరికీ తెలుసు.. ఆర్టీసీలో 10000 వేల బస్సులలో 1000 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయ్... త్వరలో మరో 2200 ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి రానున్నాయ్... గ్రీన్ ఛాలెంజ్ లో భాగంగా ఎలెక్ట్రిక్ వెహికల్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవినింగ్

4, హైదరాబాద్ గురువారం మే 28, 2026

# హైడ్రా మెగా ఆపరేషన్..

హైదరాబాద్ నగరంలో కబ్జారాయుళ్లకు, అక్రమ నిర్మాణదారులకు హైడ్రా పంజా విసురుతోంది. మంగళవారం ఐటీ కారిడార్ పరిధిలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో కోకాపేట, ఖానామెట్, భరత్‌నగర్ పరిసరాల్లోని మొత్తం 4 విలువైన స్థలాలను కబ్జా నుంచి విడిపించింది. దీని ద్వారా ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.4,117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు భూములను కాపాడి కంచెలు వేసింది. కోకాపేట కొత్తచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని విల్లాల అక్రమ నిర్మాణాలను, ఖానామెట్‌లో మాయం చేయాలని చూసిన ఈదులకుంట చెరువును, రోడ్డు విస్తరణకు పరిహారం పొంది మరీ కబ్జా చేసిన స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన, విలాసవంతమైన ప్రాంతంగా పేరొందిన కోకాపేట, ఐటీ కారిడార్ పరిసరాల్లో సాగుతున్న భూకబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. మార్కెట్లో ఎకరా భూమి ధర దాదాపు రూ.150 కోట్ల నుంచి రూ.177 కోట్ల వరకు పలుకుతున్న ఈ ప్రాంతంలో.. పక్కా ప్రణాళికతో చెరువులను, ప్రభుత్వ భూములను మింగేస్తున్న బడా రియల్టర్ల ఆటలను అధికారులు భగ్నం చేశారు. మంగళవారం నగరం వ్యాప్తంగా నాలుగు ప్రధాన ప్రాంతాలలో ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించిన హైడ్రా బలగాలు.. దాదాపు రూ.4117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు భూములకు విముక్తి కల్పించి వాటి చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేశాయి. ఈ విడత ఆపరేషన్‌లో ప్రముఖ స్థిరాస్తి సంస్థలు చేసిన అక్రమాలు బట్టబయలయ్యాయి. కోకాపేటలోని కొత్తచెరువును లక్ష్యంగా చేసుకుని గోల్డ్‌ఫిష్ కాలనీ పేరుతో వెలిసిన ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ.. చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం పరిధిలోని 1.09 ఎకరాల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించింది. అక్కడ విల్లాలను నిర్మించడమే కాకుండా.. మిగిలిన చెరువు భాగాన్ని మట్టితో పూడ్చివేసి ఓపెన్ ఏరియాగా మార్చేసింది. ఆ స్థలంలో విల్లా నివాసితుల కోసం లగ్జరీ గార్డెన్లు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, పిల్లల ఆట స్థలాలను నిర్మించింది. దీనిపై ప్రజావాణిలో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా దస్త్రాలను పరిశీలించిన హైడ్రా.. అది పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధి అని తేల్చింది. వెంటనే రంగంలోకి దిగి ఆ ఆటస్థలాలను, గోడలను పూర్తిగా తొలగించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. అలాగే కోకాపేట పెద్దచెరువు పరిధిలో వివిధ బహుళ అంతస్తుల

## //ఎడిటోరియల్//

సంస్థలు ఆక్రమించిన దాదాపు 22 ఎకరాల స్థలాన్ని కూడా కాపాడింది. ఈ ఒక్క ప్రాంతంలోనే కాపాడిన భూమి విలువ రూ.3 వేల కోట్ల పైమాటే అని అధికారులు వెల్లడించారు. మరోవైపు.. ఐటీ కారిడార్‌లోని శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలో ఉన్న ఈదులకుంట చెరువును ఏకంగా మ్యాప్ నుంచే మాయం చేసేందుకు జరిగిన కుట్రను హైడ్రా అడ్డుకుంది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువు నిండితే.. ఆ వరద నీరు కాలువ ద్వారా ఈదులకుంటకు చేరుతుంది. అయితే కబ్జాదారులు పక్కా స్కెచ్‌తో ఆ వరద కాలువను వేరే రూట్‌లోకి మళ్లించి చెరువు ఎండిపోయేలా చేశారు. ఆ తర్వాత స్కైస్క్రాపర్స్ నిర్మాణానికి భూమిని సిద్ధం చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసు నమోదైంది. హైడ్రా అధికారులు శాటిలైట్ చిత్రాలను పరిశీలించి, పాత ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి 6.50 ఎకరాల చెరువు స్థలాన్ని కాపాడి కంచె వేశారు. దీని మార్కెట్ విలువ దాదాపు రూ.600 కోట్లు ఉంటుంది. దీనికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 11/37లోని మరో 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కబ్జారాయుళ్లు సర్వే నంబర్లు మార్చి దక్కించుకోవాలని చూడగా.. హైడ్రా ఆ రూ.500 కోట్ల భూమిని కూడా స్వాధీనం చేసుకుంది. ఇక భరత్‌నగర్ – ఖైతలాపూర్ – హఫీజ్‌పేట్ రహదారి విస్తరణ పరిధిలో మరో కబ్జా వెలుగు చూసింది. రెయిన్‌బో విస్టా మీదుగా రైల్వేట్రాక్ వరకు 100 అడుగుల రహదారి నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ గతంలో భూసేకరణ చేపట్టి, ఒక భూయజమానికి పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించింది. అయితే సదరు యజమాని డబ్బులు తీసుకున్నప్పటికీ రోడ్డుకు ఇవ్వాల్సిన 1700 గజాల స్థలాన్ని తన కబ్జాలోనే ఉంచుకుని అక్కడ కార్యాలయం, గోశాలను నిర్మించాడు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవడంతో ఫిర్యాదులు అందుకున్న హైడ్రా.. జ్యుయెల్ హైట్ గేటెడ్ కమ్యూనిటీ ముందున్న ఆ అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చివేసింది.


## సంతోషాల గొడుగు

మెట్రో డైలీ

పది మందిలో నవ్వుల..
నటనలు చేసే మగాడి వెనుక..
ఆవేదనల అగాధాలుంటాయి
సమస్యల సంక్షోభాలుంటాయి
కష్టాల బస్తాల సందుల్లో..
ఎంత వెతికినా పిరికెడు..
సంతోష గింజలైనా దొరకవు
మనం చేస్తున్న సంసారం..
సదా కష్టనష్టాలతోనే..
సుఖసంతోషాల కరువే మరి !
నాలుగేళ్లు పైబడిన చెట్టును తీసి..
మరో చోట నాటడం వీలుకాదు
కాని ఇదేం చోద్యమోగాని..
ఇరవై ఏళ్ల పుట్టింటి కూతురును..
అత్తారింట్లో నాటడం విచిత్రమే
ఇది క్షమశక్తికి మాత్రమే సాధ్యం
ఆమె మొక్కలా ఎక్కడ నాటినా..
అక్కడ తన ఉనికిని చాటుకుంటూ..
రెండు గృహాల్లో వెలుగు నీడల్ని..
నింపగల మహాశక్తి స్వరూపిణి !
ఆమె ఓ బహుముఖ ప్రజ్ఞాశాలి
ఆమె చేతులు డిష్ వాషర్..
చేతల్లో మహిళ వాషింగ్ మెషిన్..
ఆమె అవిశ్రాంత ఫ్లోర్ క్లీనర్..
ఆమె ఏ డిగ్రీలు లేని అద్భుత చెఫ్..
ప్రేమలు పంచే ఏసీ కూలర్ పవనం..
అన్నామృతం వడ్డించే ఆపన్నహస్తం
బిడ్డల సుఖ సంతోషాల గొడుగు
భర్త మోన భాష తెలిసిన మేధావి
ఇవ్వడమే తెలిసిన మహా వృక్షం స్త్రీ !

మధుపాళీ 9949700037

# ఆధునిక భారత రూపశిల్పి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ




## మెట్రో తెలంగాణ చావడి




ఆధునిక భారత రూపశల్పి, స్వతంత్ర భారత తొలి ప్రధాన మంత్రి, అత్యంత దీర్ఘకాలం పాటు ప్రధానిగా విశేష సేవలు అందించిన జవహర్‌లాల్ నెహ్రూ వ్యక్తిత్వం మహోన్నతం, ఆయన చూపిన దారి నేటికీ అనుసరణీయం, అభినందనీయం. పిల్లల్ని అమితంగా ప్రేమిస్తూ, నేటి బాలలే రేపటి భావిభారతో పౌరులని నినదించిన నెహ్రూను బాలలు 'చాచా నెహ్రూ'గా ముద్దుగా పిలుచుకుంటారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన నెహ్రూను ప్రజలు 'పండిట్' అంటూ నోరారా పిలుచుకోవడం నేటికీ అలవాటుగా మారింది, తన పేరుకు ముందు ఇంటి పేరు వలె నిలిచింది. అత్యంత మేధావి, రాజనీతిజ్ఞుడు,రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, పరిపాలనాదక్షుడు, న్యాయవాది, దేశానికి మార్గనిర్దేశనం చేసిన నాయకుడు అయిన జవహర్‌లాల్ నెహ్రూ 14 నవంబర్ 1889 రోజున ప్రయాగ్‌రాజ్‌లోని సంపన్న కాశ్మీరీ కుటుంబంలో జన్మించారు. నినితొమ్మిదేళ్ల పాటు జైలు జీవితం: ప్రఖ్యాత న్యాయవాది అయిన తండ్రి మోతీలాల్ నెహ్రూ చొరవతో పాఠశాల విద్యను ఇంట్లోనే ట్యూటర్స్ సహాయంతో పూర్తి చేసి, హరో ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్య అనంతరం కేంబ్రిడ్జ్ ట్రినిటీ కళాశాలలో నేచురల్ సైన్స్‌లో పట్టాను, లండన్ ఇన్నర్ టెంపుల్ కళాశాల నుంచి బారిస్టర్ డిగ్రీని పొందారు. చదువుల తర్వాత ఏడు ఏండ్లు ఇంగ్లాండ్‌లో గడిపిన నెహ్రూ తిరిగి భారత్‌కు చేరారు. 1916లో కమలా కౌల్‌ను వివాహమాడి 1917లో ఏకైక కూతురు ఇందిరా ప్రియదర్శినికి జన్మనిచ్చారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన నెహ్రూ ఆ వృత్తిలో ఏకాగ్రతను పెట్టలేక పోయారు. 1916లో తన కన్న 20 ఏండ్లు పెద్దవాడైన గాంధీని మొదటి సారి కలుసుకున్నారు. తొలి కలయికలో గాంధీ మనసును నెహ్రూలు ప్రభావితం చేయలేక పోయినా, తర్వాత స్వతంత్ర ఉద్యామాల్లో ఆయన ప్రియ శిష్యుడిగా, అప్రకటిత వారసుడిగా మారిపోయారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కార్యదర్శిగానే కాకుండా పలు మార్లు దానికి అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి పలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని పలు మార్లు జైలు పాలైన నెహ్రూ జీవితకాలంలో దాదాపు తొమ్మిది ఏండ్ల పాటు, అనగా 3,259 రోజులు జైలులోనే గడిపారు. అల్మోరా జైలులో ఉన్నప్పుడే తన ఆత్మకథను రచించారు. అందరికీ తెలిసిన "డిస్కవరీ ఆఫ్ ఇండియా"తో పాటు "గ్లిమ్‌సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ" అనబడే ప్రఖ్యాత పుస్తకాలను రచించారు. నినిఆధునిక భారత రూపశిల్పి: 15 ఆగష్టు 1947లో స్వాతంత్రం సిద్ధించిన తర్వాత తొలి ప్రధానిగా ఎన్నికై భారతదేశ అభివృద్ధికి గట్టి పునాదులు వేశారు. ప్రపంచ స్థాయి ఐఐటీలు, ఐఐఎంలు, ఏఐఐఎంఎస్ లాంటి పలు ఉన్నత విద్యాసంస్థలను నెలకొల్పారు. శాస్త్రసాంకేతిక విద్య, మహిళా విద్య, ప్రాంతీయ భాషల్లో విద్యాబోధనలు, లౌకిక/సాంస్కృతిక/మానవీయ/నైపుణ్య/వృత్తిపరమైన విద్యలకు ప్రాధాన్యం ఇస్తూ దేశ యువతకు చక్కటి మార్గాన్ని చూపడంలో కృతకృత్యులు అయ్యారు. 15 ఆగష్టు నుంచి తుది శ్వాస విడిచే వరకు, అనగా 27 మే 1964 వరకు దేశ ప్రధానిగా 16 ఏండ్ల 286 రోజుల పాటు దీర్ఘకాలం సేవలు అందించారు. దేశ విభజన సమయంలో మత ప్రాతిపదికన విభజనలు వ్యతిరేకించిన నెహ్రూను లార్డ్ మోంట్‌బాటెన్ ఒప్పించగలిగారు. 1962లో సరిహద్దు వివాదాల కారణంగా చైనాతో జరిగిన యుద్ధంలో భారత్ ఓటమి పాలుకావడాన్ని జీర్ణించుకోలేక మధనపడుతూ తన ఆరోగ్యాన్ని కూడా కోల్పోయారు మన పండిట్ నెహ్రూ. భారత ప్రజాస్వామ్య పటిష్టత, ముందు చూపు కలిగిన పాలన, సామాజిక న్యాయాలే లక్ష్యాలుగా స్వతంత్ర భారత సమగ్రాభివృద్ధికి గట్టి పునాదులు వేసిన జవహర్‌లాల్ నెహ్రూ జీవితం నేటి యువతకు కూడా దారి దీపంగా నిలుస్తున్నది, దేశం కోసం త్యాగాలు చేయమని నినదిస్తున్నది. నినినెహ్రూ పేరును గాంధీగా మార్చుకున్న వైనం: స్వాతంత్రం పొందిన తర్వాత ప్రధానిగా సర్దార్ వల్లబాయ్ పటేల్‌ను నాటి కాంగ్రెస్ కోర్ కమిటీ ఎంపిక చేసినప్పటికీ గాంధీగారి చొరవతో జవహర్‌కు ఆ పదవి దక్కడం ఓ చరిత్రగా మిగిలి పోయింది. దేశ విభజన సమయంలో తన ప్రధాని పదవిని పదిలపరుచుకోవడంలో నిమగ్నమైన నెహ్రూ, దేశం వన పోరాటం చేయడంలో తగిన చొరవ చూపలేదనే విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. దేశ చరిత్రను వక్రీకరించి, అసలైన భారతీయతను తెరమరుగు చేయడానికి కృషి చేశారని కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# నల్లమల అడవిలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి



శ్రీ మహావిష్ణువు శ్రీ రంగనాథ స్వామిగా కొలువై ఉన్న ఆలయాలు దక్షిణ భారతంలోనే ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ద్రావిడ సంప్రదాయాన్ని పాటించే తమిళనాడులో రంగనాథ స్వామి ఆలయాలు అధికంగా చూడవచ్చు. అయితే ఈ ఆలయాల్లో చాలావరకు స్వయంభువు ఆలయాలుగా ఉండడం విశేషం. ఈ క్రమంలో దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన రంగనాథ స్వామి ఆలయం చాల విశిష్టమైంది.

**వారంలో ఒక్కరోజు మాత్రమే దర్శనం**

దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో, ఆహ్లాదకరమైన పచ్చని ప్రకృతి నడుమ స్వయంభువుగా వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి దర్శనం వారానికోసారి అదీ శనివారం మాత్రమే! వారంలో ఒక్క శనివారం మాత్రమే తెరచి ఉంచే నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయం మార్కాపురం జిల్లా రాచర్ల మండలం. జె.పుల్లలచెరువు గ్రామంలో నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్య పరిధిలో వెలసి ఉంది.

**స్థల పురాణం**

పూర్వం నెమలి శిరస్సుతో ఉన్న మయూర మహర్షి అనే ఋషి నల్లమల అటవీ ప్రాంతంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని శ్రీ మహావిష్ణువు కోసం తపస్సు చేయసాగాడు. మహర్షి తన తపోదీక్షలోనే తన ముక్కుతో ఒక గుండాన్ని తవ్వాడం! నెమలి శిరస్సుతో ఉన్న మహర్షి నిర్మించిన గుండం కాబట్టి ఈ గుండానికి నెమలిగుండం అనే పేరు వచ్చింది.

**విష్ణుమూర్తిని వరించిన రంగలక్ష్మి**

నెమలి గుండం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇసుకగుండం దగ్గర చెంచు జాతికి చెందిన బయ్యన్న, బయ్యక్క అనే దంపతులు నివసించేవారు. వారికి రంగలక్ష్మి అనే ఒక కుమార్తె ఉండేది. ఆమె చిన్ననాటి నుంచి శ్రీ మహా విష్ణువుని తన భర్తగా భావించేమానవమాత్రులను వివాహం చేసుకోవడానికి ఒప్పుకోలేదు. కానీ కుల పెద్దలు కట్టుబాట్ల పేరుతో ఆమెకు బలవంతంగా వివాహం జరిపించబోతే ఆమె అక్కడ నుంచి నెమలిగుండం దగ్గర తపస్సు చేసుకుంటున్న మయూర మహర్షి వద్దకు వచ్చి తన మనసులోని మాటను విన్నవించుకుందం!

**మహర్షితో కలిసి తపస్సు చేసిన రంగలక్ష్మి**

మహర్షి సూచన మేరకు రంగలక్ష్మి శ్రీ మహావిష్ణువును భర్తగా పొందడానికి తీవ్రమైన తపస్సు చేయసాగింది. కొంతకాలానికి ఆమె తపస్సు ఫలించి శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై రంగలక్ష్మిని అనుగ్రహించి ఆమెను పరిణయమాడి తనలో ఐక్యం చేసుకున్నాడు. అలా ఆ ప్రాంతంలో మయూర మహర్షి కోరిక మేరకు శ్రీ మహావిష్ణువు రంగనాథుడిగా స్వయంభువుగా అవతరించాడు. అనంతర కాలంలో మహర్షి శ్రీరంగనాథునికి ఆలయాన్ని నిర్మించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**శిలగా మారిన లక్ష్మీదేవి**

శ్రీ మహా విష్ణువు వైకుంఠాన్ని వీడి భూలోకానికి రావడంతో స్వామిని వెతుకుతూ లక్ష్మీదేవి కూడా భూలోకానికి వచ్చి స్వామికి రంగలక్ష్మితో వివాహం జరిగిన సంగతి తెలుసుకుని కన్నీరు కారుస్తూ శిలగా మారిపోయిందం! ఇందుకు నిదర్శనంగా అమ్మవారి శిల నుంచి బొట్టుబొట్టుగా నీరు ప్రవహిస్తూ ఉండడాన్ని గమనించవచ్చు.

**నియమనిష్టలతో లేకపోతే శిక్షించే తేనెటీగలు**

గిరిజనుల ఆరాధ్యదైవమైన నెమలిగుండ్ల రంగనాయక స్వామికి ఎల్లప్పుడూ తేనెటీగలు కాపలాగా ఉంటాయం! స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు శుచిగా లేకపోయినా,



నియమనిష్టలు పాటించకపోయినా, ఏ మాత్రం మైలతో ఉన్నా తేనెటీగలు వారిని నెమలిగుండం దరిదాపుల్లోకి కూడా రానీయకుండా దాడి చేస్తాయం! అలా తేనెటీగల దాడిలో భక్తులు గాయపడిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయని, ఇదంతా స్వామి మహాత్యమేనని స్థానికులు చెబుతారు.

**ఆలయ విశేషాలు**

వారంలో ఒక్క శనివారం రోజు మాత్రమే దర్శనమిచ్చే రంగనాథుని దర్శనం కోసం భక్తులు సుదూర ప్రాంతాల నుంచి కూడా తరలి వస్తారు. రంగనాథ స్వామి దర్శనం కోసం మెట్లెక్కి కొండమీదకు చేరుకోవాల్సి ఉంటుంది. చుట్టూ ఎత్తైన కొండలు, జలపాతాల నడుమ స్వామి దర్శనం భక్తులకు అలౌకికమైన అనుభూతిని అందిస్తుంది. ఇటు స్వామి దర్శనంతో పాటు అటు ప్రకృతి అందాలను తిలకిస్తూ భక్తులు మధురానుభూతిని పొందుతారు.

**పూజోత్సవాలు**

ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి నుంచి బహుళ తదియ వరకు మూడు రోజుల పాటు రంగనాథ స్వామికి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ సందర్భంగా జరిగే కల్యాణం, చక్రస్నానం వంటి ఘట్టాలు చూడటానికి పూర్వజన్మ సుకృతం ఉండాలని అంటారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
epaper.metroevenings.com
కరీంనగర్-వరంగల్
పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల | హన్మకొండ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్
తేది : గురువారం మే, 28 2026


# ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల కల సాకారం

**జిల్లాలో ఒకే రోజు 2700 ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**గంభీరావుపేటలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహం ప్రారంభించిన కలెక్టర్**



మెట్రో ఈవెనింగ్ రాజన్న సిరిసిల్ల గంభీరావుపేటరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంతో ఇండ్లు లేని నిరుపేదల కల సాకారమవుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా నిర్మాణం పూర్తయిన 2700 ఇందిరమ్మ ఇండ్లను వచ్చే నెల 1 వ తేదీన గృహ ప్రవేశాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఈ సాజిద్, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం కొరకు స్థల పరిశీలన



జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 27 (మెట్రో న్యూస్) : చలిగల్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం కొరకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ స్థల పరిశీలన చేశారు. బుధవారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు ఈరోజు స్థల పరిశీలన చేయడం జరిగిందని చేపట్టనున్న పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను సమగ్రంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యం

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**



కరీంనగర్/ చొప్పదండి బ్యూరో మెట్రో న్యూస్ "కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం. రాజకీయాలను పక్కనపెట్టి నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం కలిసి పనిచేయడంవల్ల చొప్పదండికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే రూ.50 కోట్లతో అర్నకొండ మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించుకోగలగుతున్నాం"అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కొద్ది సేపటి క్రితం చొప్పదండి మండలం అర్నకొండ విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అర్నకొండ నుండి మల్యాల వరకు 35 కి.మీల మేరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులతో కలిసి కేంద్ర మంత్రి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం. రాజకీయాలను పక్కనపెట్టి నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం కలిసి పనిచేయడంవల్ల చొప్పదండికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అభివృద్ధి చేస్తున్నాం. అందులో భాగంగా చొప్పదండి మండలం అర్నకొండ గ్రామం నుండి గోపాల్ రావు మీదుగా మల్యాల వరకు మొత్తం 35 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించే పనులకు ఈరోజు శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉంది. మొత్తం 50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ రోడ్డును విస్తరించబోతున్నాం. ఈ చుట్టుపక్కల ఉన్న మండలాల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుంది. నేను ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు అత్యధిక ప్రాధాన్యత రోడ్ల నిర్మాణానికే ఇచ్చాను. గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి సడక్ యోజన, సిఆర్ఐఎఫ్ నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణ కోసమే ఎక్కువ నిధులు తీసుకొచ్చిన అని తెలిపారు. 2 వేల 147 కోట్లు నిధులతో కరీంనగర్-వరంగల్ నేషనల్ హైవే, 578 కోట్ల రూపాయలతో ఎల్కతుర్తి-సిద్దిపేట నేషనల్ హైవే పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేయిస్తున్న. కరీంనగర్, జగిత్యాల ప్రజల చిరకాల వాంఛ గా ఉన్న కరీంనగర్- జగిత్యాల రోడ్డు విస్తరణ పనుల విషయంలో రకరకాల కారణాలవల్ల కొంత జాప్యం జరిగింది. దాదాపు 2 వేల కోట్ల నిధులతో ఈ జాతీయ రహదారి పనులకు అతి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం. గతంలో తెలంగాణ మొత్తానికి 800 కోట్ల సీఐఆర్ఎఫ్ నిధులు మంజూరైతే... అందులో ఒక్క కరీంనగర్ పార్లమెంట్ కే 291 కోట్లు తీసుకొచ్చి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించినం. ఇప్పటి వరకు దాదాపు 400 కోట్లకుపైగా సీఐఆర్ఎఫ్ నిధులు తీసుకొచ్చిన అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద (వచ్చే జులై 1 నుండి వీబీజీ రామ్ జీ స్కీంగా పేరు మారబోతోంది) ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేసినం. గ్రామీణ సడక్ యోజన పథకం కింద దాదాపు 130 కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించినం. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే వివక్ష లేకుండా ఓటేసిన ప్రజల ఆకాంక్ష మేరకు చేయి చేయి కలుపుదాం... కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఐకెపి వివోఏల సమస్యలను ప్రభుత్వం దృష్టి కి తీసుకపోతా పరిష్కారం కోసం కృషి చేస్తా

**సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ శ్రీ కేకే మహేందర్ రెడ్డి**



మెట్రో న్యూస్, ఎల్లారెడ్డిపేట/ రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలంలోని ఐకెపి వివోఏ ల సమస్యలను మంత్రివర్యులు సీతక్క కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకపోతా పరిష్కారం కోసం కృషి చేస్తానని సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఐకెపి వివోఏ ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఐ కెపి వివో ల జాయింట్ యాక్షన్ కమిటీ తరపున నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కేకే మహేందర్ రెడ్డి వారి దగ్గరికి వెళ్లగా వారు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షురాలు కొప్పుల రమ ఉపాధ్యక్షురాలు దొమ్మాటి రేణుక కార్యదర్శి నాయిని నీలిమ కోశాధికారి ఆడెపు శోభారాణి సహాయక కోశాధికారి తాటికొండ లావణ్య లు ఆయనకు అందజేశారు. మీ సమస్యల సాధన కోసం నిరాహార దీక్షలు చేపట్టడం న్యాయ బద్ధమే అయినప్పటికి ప్రభుత్వం వద్ద నిధులు లేక మీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ హాయంలో వి ఓ ఏ లు సమ్మె చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరిగిందనే విషయాన్ని ఆయన గుర్తు చేస్తు తాము అధికారంలో ఉన్నప్పటికీ మీ సమస్యల సాధన కోసం తాము కృషి చేస్తామన్నారు, యన వెంట ఏఎంసి చైర్మన్ షేక్ సభేరా బేగం గౌస్, మండల పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య , ఏంసి వైస్ ప్రెసిడెంట్ గుండు రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ గిరిధర్ రెడ్డి, మరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి, జనార్ధన్ రవి యాదవ్ పందిర్ల శ్రీనివాస్ గౌడ్, మెండే శ్రీనివాస్ యాదవ్, షకీల్ వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ జిల్లా నాయకులు, మండల నాయకులు అన్ని విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలసదనం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



మెట్రో న్యూస్ పెద్దపల్లి బ్యూరో. ఈ నెల 29న ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బాలసదనం ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సుల్తానాబాద్‌లోని బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలసదనం నిర్వహణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, చిన్నారులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించి అక్కడి వసతులు, ఆహారం, పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. తర్వాత సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీ సేవా ద్వారా వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చే దరఖాస్తులను సకాలంలో స్క్రూటినీ పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు ఎలాంటి చోటు లేదని, ప్రజలు తమ సమస్యలను నేరుగా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించి, ప్రజలకు సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో బి.డబ్ల్యూ.ఓ. వేణుగోపాల్, సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరోద్దీన్, తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత ఉద్యోగ సాధనకు ఎస్సీ స్టడీ సర్కిల్ బలమైన వేదిక కావాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**వడ్డేపల్లి లోని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్**



హనుమకొండ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ మే (27)నిరుద్యోగ యువత ఉద్యోగ సాధనలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఒక బలమైన వేదికగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.వడ్డేపల్లి సమీపంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. స్టడీ సర్కిల్‌లో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, గతంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఇక్కడ చేరిన ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తూ విజయాన్ని సాధించాలని సూచించారు. పేద నిరుద్యోగ యువతకు నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత శిక్షణ అందించి పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దడమే ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.డిగ్రీ పూర్తి చేసి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ సర్కిళ్లు అన్ని విధాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాల సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తులో ఉన్నత అధికారులుగా ఎదిగే అవకాశాన్ని వదులుకోకుండా క్రమశిక్షణతో చదువుతూ లక్ష్య సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కె. జగన్మోహన్, వార్డెన్ కృష్ణ, కనకరాజు, బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

**ఊర చెరువు రిటైనింగ్ వాల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశం**



హనుమకొండ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ మే (27)హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా సందర్శించి అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ముందుగా గోపాలపూర్ ఊర చెరువు వద్ద ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఊర చెరువు డీసిల్టేషన్ టెండర్లు పూర్తయిన నేపథ్యంలో వెంటనే పనులు ప్రారంభించి, వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువును పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని సూచించారు. అదేవిధంగా 56వ డివిజన్‌లోని గోపాలపూర్ ఊర చెరువు సమీపంలో "వేస్ట్ టు ఆర్ట్" కార్యక్రమంలో భాగంగా చెత్త వేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. చెత్త లేకుండా పరిశుభ్రంగా, సుందరీకరణతో తీర్చిదిద్దిన ప్రాంతాలను పరిశీలించి నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. అనంతరం 53వ డివిజన్ ఆదర్శ నగర్‌లో విండో కంపోస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. బాలసముద్రంలో ఉన్న వెహికిల్ షెడ్, సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను తనిఖీ చేశారు. డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం తగిన స్థాయిలో జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా తడిఉపొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత జవాన్లు, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలసముద్రంలోని వర్మీ కంపోస్టింగ్ యూనిట్, విండో కంపోస్ట్, బయో కంపోస్ట్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్, బయో కంపోస్ట్ యూనిట్లు 100 శాతం సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బయో మీథనైజేషన్ ప్లాంట్‌ను కూడా సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ తనిఖీల్లో సీఎంఓహెచ్ డాక్టర్ రాజారెడ్డి,జిల్లా ఇరిగేషన్ అధికారి కిరణ్ కుమార్, డీఈ హర్ష వర్ధన్, సూపర్వైజర్ నరేందర్, ఎస్సై భాషా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించిన డాక్టర్ అనిల్ నాయక్



వరంగల్( మే 27)మెట్రో ఈవినింగ్స్ టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట మండలంలో తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించిన నర్సంపేట బాధ్యులు డాక్టర్ బోడ అనిల్ కుమార్ వరంగల్ జిల్లా ఇంచార్జ్ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా అనిల్ నాయక్ మాట్లాడుతూ... తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవిర్భావం నుండి తెలంగాణ రాష్ట్రంలో గ్రామ గ్రామాన టిఆర్ఎస్ పార్టీకి ఆదరణ లభిస్తుంది అని అన్నారు. అనతి కాలంలోనే టీఆర్ఎస్ పార్టీ నేత కల్వకుంట్ల కవితమ్మ సారథ్యంలో లక్షలాదిమంది టిఆర్ఎస్ పార్టీలో చేరారు అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రోజు వందలాది మంది టిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్లి బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరుగుతుంది అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కవితమ్మ నాయకత్వంలో కోట్లాదిమంది టిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి అన్నారు. తెలంగాణలో వెల్లువల కవితక్కకు పెరుగుతున్న అభిమానాన్ని బట్టి చూస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిచి కవితమ్మ సీఎం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి అన్నారు. పాంచ జన్యం పథకాల గురించి మాట్లాడుతూ ఉచిత విద్య వైద్యం ఉపాధి వ్యవసాయం సామాజిక తెలంగాణ దిశగా తెలంగాణ రక్షణ సేన క్షేత్రస్థాయిలో ముందుకు వెళ్లి అధికార పీఠాన్ని తగ్గించుకునే విధంగా కవితమ్మ ప్రణాళిక ఉంటుందని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ రక్షణ సేన పార్టీకి మద్దతుగా నిలవాలని వేడుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు నిశాంత్ రాహుల్, వంశీ, బన్నీ, వినోద్ జ్ఞానదీప్, వెంకటేష్, సురేష్, డా. వీరు, మహేందర్ కిరణ్ అభిలాష్ బిచ్చ గణేష్ ,మధు నరసింహ, చందు ,ఓంకార్, కిరణ్ కుమార్ మహిళ నాయకులు శాంతి, ఈరమ్మ,ఐశ్వర్య,కుమారి, దీప్తి తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి.

**చెన్నరావుపేట సర్పంచ్. కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి.**



వరంగల్ (మే 27)మెట్రో ఈవినింగ్స్ చెన్నారావుపేట గ్రామం లోని గంగిరెడ్డుల కాలనీ మరియు నెంబర్ వన్ కాలనీ లలో బడిబాట కార్యక్రమం లో చెన్నరావుపేట గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ తల్లితండ్రులతో మాట్లాడుతూ విద్యార్థులను అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అలాగే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలిపారు.చెన్నరావుపేట హైస్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ కు వచ్చే విద్యార్థులకు ప్రత్యేకంగా మేము ఆటో ను ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తల్లితండ్రులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారి మానుపాటి పాపమ్మ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అలాగే ప్రభుత్వం ఇస్తున్న ఉచిత సౌకర్యాలని సద్వినియోగం చేసుకోవాలని ఎం.ఈ. ఓ. తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్ దొంతి శ్రీనివాస్,11 వ నంబర్ వార్డు సభ్యులు ఈసంపల్లి ఐలయ్య మరియు ఉపాధ్యాయులు వేముల కిషోర్,పోలేపల్లి రవి,రజిని,శ్రీనివాస్ రెడ్డి,స్వామి, ఇల్ల సూరయ్య,మాధురి మరియు ఆఫీస్ సిబ్బంది గుళ్ళపెల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## బక్రీద్ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలి జిల్లా ఎస్పీ చంద్ర పవార్.



నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్.బక్రీద్ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ చంద్ర పవార్ అన్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా మునుగోడు రోడ్డులోని ఈద్గా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం అయన మాట్లాడుతూ ప్రార్థనలకు భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలు, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర పండుగను ప్రశాంత వాతావరణం లో జరుపుకునేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.పండుగ సందర్భంగా సామరస్య వాతావరణాన్ని కాపాడాలని, యువత సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, ఎస్బి సీఐ ఆది రెడ్డి, 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,జిల్లా గ్రంధాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్,డిప్యూటీ మేయర్ ఆమేర్,కార్పొరేటర్స్,ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధ్యానత

**పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్.**



నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధ్యానత ఇస్తున్నదని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ దాన కిషోర్ అన్నారు. బుధవారం ఆయన చిట్యాల మండలం, చిన్నకాపర్తి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జల శక్తి అభియాన్ జనసంచాయ్‌ఉజన్ భాగీదారి కార్యక్రమాలను పరిశీలించారు. అంతేకాక ఉపాధి కూలీలతో మాట్లాడి పనులు ఎలా జరుగుతున్నాయని వేతనాలు సమయానికి అందుతున్నాయా? అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారా? అనిఅడిగి తెలుసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి పనులు చేస్తున్నామని, రోజుకు సుమారు రూ.300 వరకు కూలి అందుతోందని మహిళ కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16.20 లక్షల మంది ఉపాధి హామీ కూలీలు పనిచేస్తుండగా, నల్గొండ జిల్లాలో 1.20 లక్షల మంది పనిచేస్తున్నారని అన్నారు. ఉపాధి కూలీల నమోదులో రాష్ట్రంలో ముందంజలో ఉన్న నల్గొండ జిల్లాను జిల్లా కలెక్టర్ ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. మహిళా సంఘాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించేలా ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.870 కోట్లు, మహిళల కోసం ఆర్టీసీ బస్సుల నిర్వహణకు రూ.1300 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అన్ని గ్రామపంచాయతీ భవనాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నకాపర్తి చెరువును పరిశీలించి,ఉపాధి పనుల్లో తీస్తున్న మట్టిని రైతుల పొలాల్లో వేయడం వల్ల భూమి సారవంతం అవుతుందని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ నిధులను వినియోగించాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని , చిన్నకాపర్తి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, ప్రస్తుతం ఉన్న 800 కుటుంబాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్యను 500కు పెంచాలని చెప్పారు.గ్రామపంచాయతీ నర్సరీని సందర్శించి ద్రాక్ష, కాకర, చింత, అశ్వగంధ, కరివేపాకు, నేరేడు, బాదం, రాగి, మామిడి వంటి మొక్కలను పరిశీలించారు. గ్రామంలో రహదారులు, హెల్త్ సెంటర్, మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులను కూడా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్నకాపర్తి గ్రామంలో ఉపాధి పథకాల అమలుపై ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఉపాధి కూలీలకు తాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు , టెంట్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాకు జాతీయ అవార్డు రావడం గర్వకారణమన్నారు. జలసంచాయ్ జన భాగీ దారి పథకంపై మే 11 నుంచి జూన్ 10 వరకు ఆరు నియోజకవర్గాల్లో నాలుగు బృందాలతో ప్రచార రథాలు తిరుగుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. స్పెషల్ కమిషనర్ లక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, ఏపీ డి నరసింహారావు, జిల్లా సమాక్య అధ్యక్షురాలు మాధవి, గ్రామ సర్పంచ్ సుందర్ ,స్పెషల్ చీఫ్ సెక్రటరీ వెంట ఉన్నారు

## మహిళా సాధికారత కు ప్రభుత్వం పెద్దపీట

**కేరళ తరహాలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి**

**పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడటమే సీఎం లక్ష్యం**

**18 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్**

**ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ**



మెట్రో న్యూస్,(మే27) సూర్యాపేట ప్రతినిధి: మహిళల సాధికారత కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, కేరళ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడటమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ప్రముఖ వైద్యులు 18 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు.జిల్లా కేంద్రంలోని బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 18 వ వార్డులో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. పేద ప్రజలకు సన్న బియ్యం, మహిళలకు ఉచితంగా బస్ సౌకర్యం , 200 యూనిట్ల లోపు గృహాలకు ఉచిత విద్యుత్తు, పేదలకు రెండు లక్షల ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేసిందని తెలిపారు.. వికలాంగులకు పెంచిన పెన్షన్ ను ప్రభుత్వం అమలు చేసేలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదవారికి ఐదు లక్షల జీవిత భీమాను కల్పిస్తుందని అది కుటుంబానికి ఎంతో భరోసాను కల్పిస్తుందని అన్నారు. ప్రతి పేదవాడు గుడిసెలో నివసించకుండా పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాలోతు కమల చంద్రు నాయక్, నిమ్మల వెంకన్న, ధర్మానాయక్, మేరుగు రమేష్, కట్కూరి శేఖర్ రెడ్డి, బానోతు చాంప్లా, శంకర్ నాయక్, వార్డ్ ఆఫీసర్ నాగార్జున, సంతోష్‌పాల్గొన్నారు.

## అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



మెట్రో న్యూస్(మే 27)నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఎండల తీవ్రత దృష్ట్యా బాటసారులకు చల్లని మజ్జిగను అందించి దాహార్తిని తీర్చారు.మజ్జిగ దాతలుగా అలిశెట్టి శ్రీను,రాము,నవీన్ లు మజ్జిగ అందించారు.ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి,అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాష్ట్ర సభ్యులు చిన్నపల్లి శ్రీను గురుస్వామి,యారవ శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ నాగయ్య వినోద్ మరియు అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నేరేడుచర్ల మండల అధ్యక్షులు బుడగబోయిన రామకృష్ణ,జొన్నలగడ్డ సైదులు,పంగ శ్రీను మరియు పలువురు స్వాములు స్థానికులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం:ఎంపీడీవో సరోజ

మెట్రో న్యూస్,(మే 27 ),గరిడేపల్లి సంఘాల బలోపేతం ద్వారా మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీడీవో ఆర్. సరోజ అన్నారు. బుధవారం గరిడేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2026-27 ఆర్థిక సంవత్సర యాక్షన్ ప్లాన్‌పై మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వీరకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం బెనర్జీ మాట్లాడుతూ గ్రామాల్లో సంఘాల వెలుపల ఉన్న మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘాల్లో చేర్పిస్తామని, అలాగే 15 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలతో పాటు వృద్ధులు, వికలాంగులతో ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసి ఆర్థికంగా



బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హత గల సంఘాలకు బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి రుణాలు మంజూరు చేస్తామని, మహిళలు రుణాలను సకాలంలో చెల్లించి ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ స్వయం ఉపాధి అవకాశాలు పెంచుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం అజయ్ నాయక్, సీసీలు సైదులు, సుజాత, సమాఖ్య ప్రతినిధులు రజియా, గంగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, ధరణి, అకౌంటెంట్ దుర్గ, కవిత మరియు 45 సంఘాల అధ్యక్షురాళ్లు, వీవోఏలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం కోసం రంగంలోకి దిగిన సర్పంచ్ లావుడ్య పూర్ణ



కొత్తగూడెం ఆర్ సి (మెట్రో న్యూస్):తెలంగాణ ప్రభుత్వం అతి త్వరలో 2 లక్షలకు పైగా కొత్త పెన్షన్ల మంజూరుకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో, నూతన పెన్షన్ల లబ్ధిదారుల సౌకర్యార్థం పెద్దతండా పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్య పూర్ణ స్వయంగా పాల్గొని ప్రజలకు అండగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో వితంతు, వృద్ధాప్య మరియు వికలాంగుల పెన్షన్ దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందజేసి, యువకులతో కలిసి ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి దరఖాస్తులు నింపించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. కేవలం ఫారాలు పంపిణీ చేయడమే కాకుండా, స్వయంగా దగ్గరుండి ప్రతి ఒక్కరి వివరాలు పరిశీలిస్తూ, అప్లికేషన్ ప్రక్రియను సులభతరం చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు.

చిన్న వయసులోనే ప్రజా సమస్యలను అర్థం చేసుకొని, ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్న సర్పంచ్ లావుడ్య పూర్ణ సేవా తత్వాన్ని గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ, సంక్షేమ పథకాల అమలులో ముందుండి పని చేస్తూ నూతన మార్గాన్ని చూపిస్తున్నారని గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

"ప్రజల సేవే నా ధ్యేయం.. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాను" ఈరోజు మొత్తం 27 అప్లికేషన్లు వచ్చాయని ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ తెలిపారు. గ్రామ ప్రజలు సర్పంచ్ సేవలను కొనియాడుతూ, ఇలాగే ప్రజా సంక్షేమం కోసం ముందుండి సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఇస్మాయిల్ , యువనాయకులు ధరావత్ హనుమాన్,నూనావత్ గణేష్, లావుడ్య శ్రీహరి, భూక్యా జాను, పద్మావత్ విజయ్ కుమార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి .డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**గురుకుల పాఠశాలల్లో ప్రతి సీటు భర్తీ కావాలి.నిర్లక్ష్యానికి తావులేదు**

**సీట్లు భర్తీ కాని పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించాలి**

**ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలి**

**వైద్యులు ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలి**

**పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించాలి**

**గురుకుల స్వంత భవనాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలి**

**గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



ఖమ్మం మెట్రో ఈవెనింగ్ మే 27:రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సంబంధిత అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతి విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలోనే అవసరమైన మరమ్మతులు, మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురుకుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎస్‌ఈ, ఎన్పిడిసిఎల్ శ్రీనివాస్, విద్యా శాఖ సంబంధిత అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చౌడవరంలో ఉపాధి కూలీలకు చల్లని మజ్జిగ పంపిణీ

**జన్మదిన వేడుకలను సామాజిక స్పృహతో జరుపుకున్న యువకుడు.**

వేంసూరు, మే 27(మెట్రో న్యూస్).మండుటెండల్లో ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీల దాహార్తిని తీర్చేందుకు ఓ యువకుడు ముందుకు రావడం అభినందనీయం. స్థానిక చౌడవరం గ్రామానికి చెందిన గాయం వెంకట నారాయణ, పద్మావతి దంపతుల కుమారుడు గాయం.ఈశ్వర సాయి తన జన్మదినాన్ని పురస్కరించుకుని, గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న తరుణంలో కూలీలు పనులకు వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి సమయంలో



వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, చల్లని మజ్జిగ అందించడం పట్ల గ్రామస్తులు, కూలీలు హర్షం వ్యక్తం చేశారు. కేవలం విందు, వినోదాలకే పరిమితం కాకుండా, సామాజిక సేవలో భాగస్వామ్యం కావడంపై గ్రామస్తులు ఈశ్వర సాయిని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో చౌడవరం గ్రామ సర్పంచ్ నల్లిబోయిన అంజమ్మ గ్రామ ప్రముఖులు చిన్నకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ గొర్ల.సత్యనారాయణ రెడ్డి, వార్డ్ మెంబర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారంతా గాయం ఈశ్వర సాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కూలీలు సైతం తమకు అండగా నిలిచిన యువకుడికి కృతజ్ఞతలు తెలుపుతూ, అతను మరిన్ని పుట్టినరోజులు ఇలాగే సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# రైతుల బాధలు పట్టని ప్రభుత్వం

**తడిసిన ధాన్యానికి పరిహారం ఇవ్వాలి**

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్.**



మెట్రో న్యూస్ నారాయణపేట రూరల్ మే 27:తెలంగాణ రాష్ట్రంలో రైతు లు ఎంతో కష్టపడి పండించి న వడ్లు కొనుగోలు కాక కొనుగోలు కేంద్రాల వద్దే పేరుకుపోతున్నాయనీ రైతుల బాధలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిజెపి నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజుల తరబడి ఎదురు చూస్తున్న రైతులకు సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేశం వ్యక్తం చేశారు. ఇప్ప టికే అకాల వర్షాలతో వడ్లు తడిసిపోవడంతో రైతులు భారీ నష్టాలను చవిచూస్తు న్నారన్నారు.పండించిన పంటకు ధర రాక, కొనుగోలు ఆలస్యం కావడం, తడిసిన ధాన్యాన్ని తిరస్కరించడం వల్ల రైతు ఆవేదనలో ఉన్నా డనీ అన్నారు.రైతు చెమట తో పండిన ప్రతి గింజకు విలువ ఇవ్వాల్సిన ప్రభు త్వం, రైతుల కన్నీళ్లు కనిపిం చకపోవడం దురదృష్ట కరనన్నారు.రైతుల సమ స్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?అని ప్రశ్నించారు.రైతు కష్టం గుర్తు కురాకపోతే, రైతు సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ప్రభుత్వానికి లేదని అన్నా రు.వెంటనే వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ, అకాల వర్షాలతో నష్టపోయి న రైతులకు తక్షణ పరిహారం అందించాలనీ, రైతును ఆదుకునే చర్యలు వెంటనే చేపట్టాలనీ డిమాండ్ చేశారు.

# మన్నెంకొండలో శ్రీకృష్ణుడి విగ్రహ స్థాపనకు స్థల పరిశీలన... ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్ రెడ్డి.

మెట్రో న్యూస్, మహబూబ్‌నగర్:మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రముఖ ఆధ్యాత్మిక,క్షేత్రం మన్నెంకొండలో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహ స్థాపనకు సంబంధించి స్థల పరిశీలన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న విగ్రహానికి అనుకూలమైన ప్రదేశాన్ని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి టూరిజం శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా విగ్రహ స్థాపనతో భక్తులకు కలిగే సౌకర్యాలు, దేవాలయ అభివృద్ధి, పర్యాటక ఆకర్షణ పెంపు వంటి అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మన్నెంకొండ దేవస్థానం రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఇక్కడ శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే



దేవాలయాన్ని సందర్శించి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలుసమర్పించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు సుధాకర్ రెడ్డి, మల్లు అనిల్ రెడ్డి, కార్పొరేటర్లు, దేవస్థానం అధికారులు, టూరిజం శాఖ సిబ్బంది,స్థానికప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.

## మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ అప్పగింత

**ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

నాగర్ కర్నూల్ (మెట్రో న్యూస్:మే27) జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్ లో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)లో భాగంగా మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి, సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అలాగే మహిళా శక్తి భవన ప్రారంభోత్సవ



కార్యక్రమాన్ని జూన్ 3న నాగర్‌కర్నూల్‌లో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేయడమే తమ లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, స్థానిక కౌన్సిలర్స్, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మొదటి స్థానంలో ఎస్వీఎస్ విద్యార్థులు

**ఎస్వీఎస్ విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్**



ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఎస్వీఎస్ విద్యార్థులు ఎస్ఎస్సి 2026 ఫలితాలలో వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు ఎస్ఎస్ సెంటర్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు ఎస్వీఎస్ సెంటర్ స్కూల్ పాఠశాల విద్యార్థి శ్రీనిధి 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నది అలాగే మరొక విద్యార్థిని పి శృతి 600కు మార్కులకు కాను ₹575 మార్కులు సాధించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అదుర్స్ సురభి విద్యార్థులను అభినందించి ప్రశంస పత్రం అందించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అదుర్స్ సురభి ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ఎస్వీఎస్ సెంటర్ స్కూల్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాలలో ఎంతో కష్టపడి ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం చేరుకున్నందుకు అభినందదాయకమని అన్నారు ఎస్వీఎస్ స్కూల్ కరస్పాండెంట్ కాజల్ కూడా అభినందించారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై కలెక్టర్ ఆరా.

**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్.**



నాగర్ కర్నూల్ బ్యూరో:----( మెట్రో న్యూస్:మే 27) నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని బల్మూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ బుధవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు,సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏఎన్ఎం కిట్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు.కిట్‌లో ఉన్న వైద్య పరికరాలు,మందులు, అత్యవసర సేవలకు ఉపయోగించే సామగ్రి గురించి సంబంధిత వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ఏఎన్ఎం కిట్టులో పాము కాటు,కుక్క వ్యాక్సిన్ లు,పిల్లలకు అందించే వ్యాక్సిన్లు ఉన్నాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు..గర్భిణీలు, చిన్నారులకు అందించే వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని,గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీ సందర్భంగా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీవో యాదగిరి తహసీల్దార్ శ్రీనివాస్,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,స్థానిక వైద్య సిబ్బంది,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అందోల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మంత్రి దామోదర్ ధ్యేయం .

**57.50కోట్లతో ఫార్మసీ కాలేజ్ మంజూరు.**

**జోగిపేటలోమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం**



మెట్రో న్యూస్ జోగిపేట్ అందోల్ ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడ మే మంత్రిమంత్రి దామోదర్ దేయమని జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంజయ్య అన్నారు. అందో లుకు ఫార్మసీ కాలేజ్ మంజూరి పట్ల జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆందో లులో ఎన్నో కాలేజీలు మంజూరు అయ్యా యాని ఇందులో భాగంగానే 57.50 కోట్లతో జేఎన్టీయూ సుల్తాన్పూర్ లో ఫార్మసీ కాలేజ్ మంజూరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఒక్కొక్కటిగా ఆయన ఇప్పటికే అన్ని కాలేజీలు మంజూరు అయ్యాయని ఇప్పుడు ఫార్మసీ కాలేజీ మంజూరు చేయడం అభినందనీయం అన్నారు. ఇప్పుడు ఆందో లు నిజంగా ఎడ్యుకేషన్ అబుగా అయిందన్నారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో ఫార్మసీ కాలేజ్ భవనాలు బాల బాలికల హాస్టల్ వసతి, విశ్రాంతి గృహము ఇవన్నీ నిర్మాణాలు చేపడతామన్నారు. మున్సిపల్ చైర్మన్ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఆందో లులో వందల కోట్ల అభివృద్ధి పనులు నడుస్తున్నాయని ఇవన్నీ మంత్రి దామోదర్ కృషి అని ఆయన అభిప్రాయపడ్డారు. అందోల్ చెరువు మరో ట్యాంక్ బండ్ గా మార పోతుందని దీంతో అక్కడ పర్యాటక శోభసంతరించుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ అధ్యక్షులు శివరాజ్ , జోగిపేట కౌన్సిలర్లుసురేందర్ గౌడ్, పట్లోళ్ల ప్రవీణ్ కుమార్, గూడెం మల్లయ్య, నాని, అల్లే శ్రీకాంత్, అరుణ్ కుమార్, పట్లోళ్ల శ్రీను, దుర్గేష్, సైలెన్, రాజశేఖర్ అనిల్ కుమార్, ప్రదీప్ గౌడ్ , కో ఆప్షన్ సభ్యులుపిట్ట లక్ష్మణ్, జి షాన్, డేవిడ్ ,పి ఏ సి ఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, తుపాకుల సునీల్, డాకూరి శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అనితను పరామర్శించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:అందోల్ నియోజకవర్గం పుల్కల్ మండలం ముద్దాయిపేట గ్రామానికి చెందిన అనిత సంగారెడ్డి మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిన శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమె మూడు నెలలుగా జీతం రావడం లేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్పందించారు. బుధవారం సంగారెడ్డి కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అనితను ఎమ్మెల్యే పరామర్శించారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయిన ఆమెతో మాట్లాడి ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ... తమ కుటుంబంలో కొనసాగుతున్న భూ వివాదాలు, తరచూ జరుగుతున్న గొడవల కారణంగా మానసిక ఒత్తిడికి గురై ఈ నిర్ణయం తీసుకున్నానని ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే జీతం విషయంలో గత నెల జీతం ఇప్పటికే అందుకున్నానని తెలిపారు. ఇదే సమయంలో పోలీస్ స్టేషన్‌కు రావాలని సమాచారం రావడంతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేకంగా వ్యక్తిని పంపించి ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకుని అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేతనాల సమస్యల వల్ల ఎవరూ ఆత్మహత్యాయత్నాలకు పాల్పడొద్దని సూచిస్తూ... ప్రతి కార్మికుడికి తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్, శ్రవణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, మనీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తాం..!

**-అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి**

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా రైతులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న ధాన్యం తడిచిందా లేదా అన్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని, జిల్లా యంత్రాంగం అన్ని వేళలా రైతులకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే లారీలతో పాటు



అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా కూడా రైస్ మిల్లులకు వెంట వెంటనే తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బంది కలగకుండా ఏవేని సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జీలకు సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకొని ధాన్యంకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట సంగారెడ్డి తహసీల్దార్ జయరాం ఉన్నారు.

# 24 గంటల్లోనే చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పట్టణ పోలీస్‌లు

## దొంగతనానికి పాల్పడ్డ భార్యాభర్తలు

## మందమర్రి సీఐ పర్ష రమేష్.

మెట్రో న్యూస్,రామకృష్ణాపూర్: మే 27/2026. జల్సాలకు అలవాటుపడి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న భార్యాభర్తలు ఎలాగైనా డబ్బు సంపాదించాలనే క్రూరమైన ఆలోచనలతో దొంగతనాలకు పాల్పడ్డారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ శ్రీనివాస్ నగర్ లో నివాసముండే నల్లాల రాయమల్లక్క మహిళామెడలోనుండి పుస్తేలత్రాడును మంగళవారం మధ్యానం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు లాకెళ్ళారని స్తానిక పోలీస్ స్టేషన్ యందు పిర్యాదు చేశారు.

మందమర్రి సీఐ పర్ష రమేష్ తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ లు రెండు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తుండగా బుధవారం ఉదయం స్తానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి వద్ద పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ తోపాటు పోలీస్ లు తనికిలు నిర్వహించగా ఆసుపత్రి ఆటో స్టాండ్ వద్ద అనుమాన స్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకొని సోదాలు



నిర్వహించగా వారి వద్దనుండి బంగారు పుస్తేలత్రాడు దొరికిందనీ తెలిపారు. వారిని విచారించగా పట్టణంలోని అదే కాలానికి చెందిన గజ్జి శ్యాం ,గజ్జి రమ అలియాస్ ఐలక్క భార్యాభర్తలు దొంగిలించిన సొమ్మును మంచిర్యాలలో అమ్మడానికి వెళ్తున్నట్లు గమనించిన పోలీస్ లు వారిని అదుపులోకి తీసుకుని దొంగిలించిన బంగారు పుస్తేలత్రాడును పోలీస్ లు స్వాధీన పరచుకోవడం జరిగిందని,వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చడం జరుగుతుందని ఆయన తెలిపారు.జల్సాలకు అలవాటుపడి ఆర్థిక ఇబ్బందుల్లో ఎలాగైనా డబ్బు సంపాదించాలని ఈ దొంగతనాలకు పాల్పడ్డారని అన్నారు. 24 గంటల్లోనే కేసును ఛేదించిన పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ తోపాటు,ఆయన సిబ్బందికి రివార్డ్ తోపాటు ప్రశంసా పత్రాలను సిఐ అందజేసి అభినందించారు.

## మరణంలోనూ పలువురికి పునర్జన్మనిచ్చిన సుప్రియ



జగిత్యాల టౌన్: మే 27 (మెట్రో న్యూస్) : జగిత్యాలలో వివాహిత అవయవ దానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు ప్రసరించి మానవత్వం చాటుకున్నది. వివరాల్లోకి వెళితే మే 24న ఆదివారం జగిత్యాల పట్టణం హనుమాన్ వాడ కు చెందిన అక్కపెల్లి ప్రవీణ్ సతీమణి సుప్రియ (25) అనే మహిళ స్కూటీ బండి నడిపించడం నేర్చుకునే క్రమంలో బండి పై నుండి ప్రమాదవశాత్తు పడి తలకు బలమైన గాయాలు కాగా, చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాదులోని యశోద హాస్పిటల్ కి తీసుకెళ్లాలని సూచించారు. గత మూడు రోజులుగా యశోద ఆసుపత్రిలో వెంటిలేటర్ పై ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు కానీ ఆమె ఆరోగ్యం కుదుటపడక పోగా మరింత విషమంగా మారి బ్రెయిన్ డెడ్ (జీవన్మృతురాలు) అయిందని తాను తిరిగి కోల్కోవడం కష్టతరమని డాక్టర్లు నిర్ధారణ చేశారు. గత మూడు రోజులుగా మృత్యువు తో పోరాడిన సుప్రియ గతరాత్రి తుది శ్వాస విడిచారు. దీనితో ఆమె భర్త అక్కపెల్లి ప్రవీణ్, కుటుంబ సభ్యులు మహిళ అవయవాలను స్వచందంగా దానం చేయడానికి ముందుకు రావడంతో, ఆసుపత్రి వైద్యులు జీవన్ దాన్ ప్రతినిధులతో మాట్లాడి అవయవ దానం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. దీనితో సుప్రియ శరీరంలోని ప్రధాన అవయవాలైన గుండె, ఊపిరితిత్తులు, కళ్ళు, మూత్రపిండాలు, కాలేయం ను జీవన్ దాన్ ప్రతినిధులు సేకరించినట్లు తెలిసింది. అనంతరం వారు మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఈ అవయవాలతో చాలా మంది జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరింపజేసిందని సుప్రియను కొనియాడారు. ఆమెకు భర్త ఇద్దరు కూతుర్లు తేజశ్రీ (6), వైష్ణక (3) ఉన్నారు. అతి చిన్న వయసులో ఇద్దరు పిల్లలని వీడి అనంత లోకాలకు వెళ్లిన సుప్రియ ఉదంతం తెలిసిన ప్రతి ఒక్కరు ఒక వైపు కొనియాడుతుంటే, మరోవైపు కుటుంబ సభ్యులు, ప్రాంత ప్రజలు చిన్న పిల్లలను చూసి కన్నీటి పర్యంతమౌతున్నారు. ఇక మరికొందరు పట్టణ ప్రముఖులు సుప్రియ చిరంజీవిగా మిగిలిపోయిందని ప్రశంసిస్తున్నారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణ అవకాశం

## -న్యాక్ ద్వారా శిక్షణ ఉ ఉపాధి కల్పన కార్యక్రమం

## -సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, మే 27 ( మెట్రోన్యూస్ )నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నేష్నల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా ఎలక్ట్రిషియన్, ప్లంబర్, మేసన్, టైలరింగ్ ట్రేడ్లలో మూడు నెలల శిక్షణ కార్యక్రమం ప్రారంభించబడుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణ కాలానికి గాను రూ. 18,000 రుసుము ఉండగా, జిల్లా యంత్రాంగం తరపున 50 శాతం రాయితీని కల్పిస్తామని అన్నారు. అభ్యర్థులు కేవలం రూ. 9000 రుసుము(నెలకు మూడు వేల చొప్పున) మాత్రమే చెల్లించి, పై ట్రేడ్ లలో శిక్షణ పొందవచ్చని సూచించారు. శిక్షణ కాలంలో అనుభవజ్ఞులైన ట్రైనర్లచే అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి కోసం ప్రాక్టికల్స్ తో పాటు థియరీలో నాణ్యమైన శిక్షణ అందించబడుతుందని అన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయని కలెక్టర్ తెలిపారు. శిక్షణ సందర్భంగా ఉచిత యూనిఫామ్, ఉచిత స్టేషనరీ, అధునాతన, సాంకేతికతతో కూడిన యంత్ర పరికరాలతో ప్రాక్టికల్ ట్రైనింగ్, అనుభవజ్ఞులైన ఇన్స్ట్రక్టర్లచే సమర్ధవంతమైన శిక్షణ, న్యాక్ ద్వారా గుర్తింపు పొందిన సర్టిఫికేట్ అందిచబడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు కలిగిన న్యాక్ సంస్థ ద్వారా ఇదివరకు వివిధ ట్రేడ్లలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పూర్తి స్థాయిలో 100 శాతం ఉపాధి అవకాశాలు కల్పించబడినాయని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. శిక్షణ తరగతులను న్యాక్ అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షణ జరుపుతారని, అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా కృషి చేస్తారని అన్నారు. పదవ తరగతి ఆ పై విద్యార్హతలు కలిగి ఉండి, 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ప్రస్తుతం ఎలక్ట్రిషియన్, ప్లంబర్, మేసన్, టైలరింగ్ ట్రేడ్లలో మూడు నెలల శిక్షణ పొందేందుకు అర్హులని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు 2026 జూన్ 09వ తేదీ లోపు నిజామాబాద్ కలెక్టరేట్ సమీపంలో గల న్యాక్ కేంద్రంలో నేరుగా దరఖాస్తులను అందించవచ్చని అన్నారు. వివరాలకు న్యాక్ కేంద్రం సహాయ సంచాలకులు లింబాద్రి, సెల్ నెంబర్: 9296507557 ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## పేద ప్రజలపై భారాలు మోపడమేనా ప్రధాని మోడీ పొదుపు మంత్రం

### -సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు



నవీపేట్, మే 27( మెట్రోన్యూస్ )పేద ప్రజలపై భారం మోపుతూ ప్రధాని మోడీ పొదుపు మంత్రం జపిస్తున్నాడని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ. రమేష్ బాబు ఆరోపించారు. బుధవారం నవీపేట్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత పది రోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచడానికి ఖండిస్తున్నామన్నారు.దీని మూలంగా పెట్రోల్ డీజిల్ పై అదనంగా 8 రూపాయలు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపి నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతాయని ఇది సామాన్యులకు నిరుపేదలకు కార్మిక కర్షకులందరికీ భారంగా మారుతుందన్నారు. ఈ నెల హైదరాబాద్ వచ్చిన సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పిన పొదుపు మంత్రం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బహిరంగ సభల్లో మేము భవిష్యత్తులో పెట్రోల్ డీజిల్ గాజులు పెంచబోమని వాగ్దానాలు ఇచ్చి తీరా ఓట్లు అయిపోయిన తర్వాత దేశ ప్రజానీకం పైన ఇలాంటి భారం మోపడం ఎంతవరకు సబబు అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ధర నియంత్రత్వాన్ని తీసుకొచ్చి వెంటనే తగ్గించాలని లేని యెడల భవిష్యత్తులో ఆందోళన పోరాటాల్లో పేద మధ్యతరగతి సామాన్య కార్మిక రైతు కర్షక వర్గాలను ఐక్యం చేసి పోరాటాల్లో దించాల్సింది వస్తుందని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్, మండల నాయకులు దేవేందర్ సింగ్, అంజయ్య,గౌతమ్ లు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు



నిజామాబాద్, మే 27 ( మెట్రోన్యూస్ )బక్రీద్ వేడుకను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరుకున్నారు. దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ప్రజలు గురువారం నాటి వేడుకను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## పాఠశాల గంట మోగేలోపే ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకాలు ఉండాలి



గంగాధర, న్యూస్ న్యూస్గంగాధర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం విజయవంతంగా ప్రారంభించారు.మండలంలోని ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మొత్తం:

25,708 పాఠ్యపుస్తకాలు
24,092 నోట్‌బుక్స్
1,845 హైస్కూల్ ప్రోగ్రెస్ కార్డులు

911 ప్రాథమిక పాఠశాల ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేయబడుతున్నాయి.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి శ్రీ ఏనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ, పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికి అవసరమైన విద్యా సామగ్రి ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరానికి సిద్ధంగా ఉండే విధంగా 100% పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ మరియు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన మొదటి రోజునుంచే అవసరమైన అన్ని విద్యా సౌకర్యాలు అందించేందుకు విద్యాశాఖ కట్టుబడి పనిచేస్తోందని శ్రీ ఏనుగు ప్రభాకర్ రావు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుదల మరియు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో మే 11 నుండి జూన్ 13 వరకు “బడిబాట కార్యక్రమం” మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్ర మిశ్రా దూరదృష్టి మార్గదర్శకత్వంలో, అదనపు కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖాధికారి డా. అశ్విని తనాజీ వాకడే మార్గనిర్దేశక పర్యవేక్షణలో నిర్వహించబడుతోంది. ప్రభుత్వ విద్య బలోపేతం మరియు పాఠశాలల సిద్ధతపై వారి నిరంతర కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు.

# రైతులకు నష్టం కలగకుండా వేగంగా ధాన్యం మిల్లులకు తరలించాలి







## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి మే 27 (మెట్రో న్యూస్‌జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి గ్రామంలో ఉన్న గురు రాఘవేంద్ర రైస్ మిల్‌ను తనిఖీ చేసి, ధాన్యం నిల్వలు, రవాణా , మిల్లింగ్ ప్రక్రియపై అధికారులతో సమీక్ష చేసి ప్రతి రోజు కనీసం 15 లారీల దాన్యం దించుకోవాలి అని మిల్లర్ లను ఆదేశించారు.అనంతరం శాబ్దిపూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూరి ఎల్లారెడ్డి వరి కొనుగోలు కేంద్రం, శ్రీ మన్నారాయణ రైస్ మిల్‌లను పరిశీలించారు.అకాల వర్షాల కారణంగా జిల్లాలో సుమారు 1,100 మెట్రిక్ టన్నుల వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,78,000 మెట్రిక్ టన్నుల వరి సేకరణ పూర్తయినట్లు తెలిపారు. ఇందులో ప్రస్తుతం 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలో ఉన్నట్లు పేర్కొన్నారు.వర్షాల వల్ల ధాన్యం తడవకుండా వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీరు నిల్వ ఉండకుండా కంధకం కాలువలు ఏర్పాటు చేయాలని, ధాన్యం కుప్పలను టార్పాలిన్‌లతో క్రింది నుండి పైకి, పైనుండి క్రిందకు కప్పి ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్ ,సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు,డి ఎం శ్రీకాంత్, తహశీల్దార్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు మరింత త్వరగా పూర్తి చేయాలి

## కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత



జగిత్యాల జిల్లా/జగిత్యాల రూరల్, మే 27 (మెట్రో న్యూస్) : వరి ధాన్యం కొనుగోళ్లు మరింత త్వరగా పూర్తి చేయాలనీ, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ జితేందర్ రెడ్డి, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్, డి టి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ : నగరంలో ప్రస్తుతం 540 ఈవీ బస్సులు నడుస్తుండగా కేంద్ర పథకం కింద త్వరలోనే రాష్ట్రా నికి మరో 1050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. గ్రీన్ చాలెంజ్ లో బాగంగా టీజీఎస్ఆర్టీసీ కూకట్ పల్లి బస్ డిపోకు కేటాయించిన 60 కొత్త ఈవీ బస్సులను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భవిష్యత్తులో నగరం వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుని మరో ఢిల్లీలా మారకూడదనే ఉద్దేశంతోనే పర్యావ రణహిత ఎలక్ట్రిక్ బస్సులను పెద్దఎత్తున అందుబాటులోకి తెస్తు న్నా మని ప్రకటించారు. త్వరలోనే ఆర్టీసీ కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తామని, ఆ తర్వాత ఎన్నికైన సంఘాలతో కలిసి ఆర్టీసీ విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్మికులకు పీఆర్సీ అమలుతోపాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కార్మికుల సమస్యలను నేరుగా తెలు సుకునేందుకు ప్రతి రెండో మంగళవారం ప్రత్యేకంగా సమయం కేటాయించనున్నట్లు వెల్లడించారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై.నాగి రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కే.నవీన్ కుమార్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, జిల్లా కలెక్టర్ మనుచౌదరి నూతన బస్సుల్లో ప్రయాణించారు. ఆర్టీసీ ఈడీలు సిహెచ్.వెంకన్న, రాజశేఖర్ లతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పట్నం పాత బస్టాండ్ వరకు ఆర్టీసీ బస్సులు తప్పక నడపాలి

- వృద్దులు, మహిళలు 2 కిలోమీటర్లు నడవలేక తీవ్ర ఇబ్బందులు



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా నుండి పాత బస్టాండ్ వరకు ఎన్నికల ముందు నుండి ఇప్పటికీ నిర్మాణ దశలో ఉన్న రోడ్డు వల్ల ప్రజా ప్రయోజనార్థం ఉన్న ఆర్టీసీ బస్సులు మున్సిపాలిటీలోని పాత బస్టాండ్‌కు రాక ప్రజల ఇబ్బందులను గుర్తించి బస్సులను పాత బస్టాండ్ వరకు నడపాలని, సమస్యలను వివరిస్తూ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డియం సుజాత ప్రాంతీయ అధికారిని మున్సిపాలిటీ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ ముత్యాల శ్యామల భాస్కర్ లు స్థానిక కౌన్సిలర్లతోపాటు కలిసి విజ్ఞప్తి చేశారు. బస్సులు పాత బస్టాండ్ వరకు రాక పోవడంతో సాగర్ రోడ్డు చౌరస్తా నుండి పాత బస్టాండ్ వరకు రెండు కిలోమీటర్ల మేర వృద్ధులు మహిళలు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు పనుల సమస్య లేదని, విశాలంగా ఉన్న రోడ్డులో వాహనాల రాకపోకలు సజావుగా సాగుతున్నాయని వెంటనే పాత బస్టాండ్ వరకు బస్సులు నడిపి ప్రజా సమస్యలు తీర్చాలని కోరారు. ఈ విషయంపై స్పందిస్తూ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డియం సుజాత ప్రాంతీయ అధికారి తక్షణమే బస్సులను మున్సిపాలిటీలోని పాత బస్టాండ్ వరకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చిలుకల బుగ్గ రాములు,గూడూరు గిరి,కొంద్రు శ్రీలత రాంబాబు నాయకులు ముత్యాల భాస్కర్,మడుపు శివ సాయి,కొత్త గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది మొజుజుద్దీన్ హత్యకు ఉపయోగించిన స్కార్పియో కారు లభ్యం



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** నగరంలో సంచలనం రేపిన ప్రముఖ న్యాయవాది మొజుజుద్దీన్ హత్య కేసులో హంతకులు ఉపయోగించిన స్కార్పియో కారు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని బై పాస్ రోడ్ లో గల రుచి బార్ వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులకు స్కార్పియో కారు లభించింది. హంతకులు కారు ను ఇబ్రహీంపట్నంలోని రుచి బార్ వద్ద వదిలి వెళ్లినట్లు సమాచారం. న్యాయవాది మొయిజుద్దీన్ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది, వక్ఫ్ బోర్డు ప్యానెల్ అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ ఇటీవల సంచలనం సృష్టించిన హత్యోదంతం ద్వారా వార్తల్లో నిలిచారు.. భూ వివాదాలు, వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కేసులకు సంబంధించి ఆయన ప్రత్యర్థులు పక్కా ప్లాన్ ప్రకారం ఆయన్ను హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి మొదట ఈ ఘటనను రోడ్డు ప్రమాదం (హిట్ అండ్ రన్)లా చిత్రీకరించాలని నిందితులు భావించారు. అనుమానం రాకుండా స్కార్పియో కారుతో ఢీకొట్టించి దారుణానికి ఒడిగట్టారు. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ పోలీసులు గోవాలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో వినయ్ అనే వ్యక్తి కారు నడిపినట్లు గుర్తించారు. స్థానిక భూములు, కబ్జాలకు సంబంధించిన వివాదాలే ఈ హత్యకు ప్రధానకారణమనిపోలీసులప్రాథమికవిచారణలోతేలింది. ఈ ఘటన పై జాతీయ మానవ హక్కుల సంఘం కూడా కేసు నమోదు చేసింది. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తుండగాపూర్తివివరాలుతెలియాల్సి ఉంది.

# సెంట్రింగ్ కార్మికుల డిమాండ్ల సాధనకు మద్దతు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ , నేరేడ్మెట్ జోన్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో సఫిల్ గూడ చౌరస్తాలో సెంట్రింగ్ కార్మికులు వారి సమస్యలను మరియు వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనిగత కొద్ది రోజులు నిరాహార దీక్ష చేస్తున్నారు. సెంట్రింగ్ కార్మికుల దీక్ష కార్యక్రమానికి మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వారి డిమాండ్ల సాధనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మరియు వారి డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఉన్నటువంటి భావన నిర్మాణ, మరియు సెంట్రింగ్ కార్మికులకు ప్రతి ఒక్కరికి లేబర్ కార్డు అందేలా ఎమ్మెల్యే కృషి చేస్తానన్నారు. కార్మిక శాఖ, కార్మికుల సంక్షేమ మండలిలో నమోదు చేసుకున్న కార్మికులకు లేబర్ కార్డు ద్వారా లభించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పాటు పాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా ఏ ఆపద వచ్చిన నేనున్నానని ప్రజల పక్షాన నిలబడే నిజమైన నాయకుడు మన ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి శేఖర్ రెడ్డి అని సెంట్రింగ్ కార్మికుల సంక్షేమ సంఘం సభ్యులు కొనియాడారు. తక్షణమే మా సమస్యపై స్పందించి దీక్షా శిబిరానికి చేరుకొని కార్మికులకు మద్దతు తెలిపిన శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డికి,




మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్కి మరియు బద్దం పరుశురాం రెడ్డికి కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, ఖలీల్, నీలం సతీష్, ఉస్మాన్, సిక్కా ప్రభాకర్ గౌడ్, హేమంత్ పటేల్, బాలకృష్ణ సూరి, ఫరీద్,ఇమ్రాన్,మారుతి ప్రసాద్, శ్రీనివాస్, సాయి ముదిరాజ్, సర్వేశ్, రాజశేఖర్, ఉమేష్, వినీత్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు సెంట్రింగ్ కార్మికుల సంక్షేమ సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చెరువు శిఖాన్ని ఆక్రమించిన మైహోమ్ రామేశ్వర రావు సంస్థ

- మాదాపూర్ ఐటీ కారిడార్‌లో కోట్ల రూపాయల విలువైన స్థలం కబ్జా చేసి కథలు అల్లిన వైనం..!
- స్వాధీనం చేసుకున్న హైడ్రా..!




**మెట్రో న్యూస్ ప్రతినిధి, శేరిలింగంపల్లి :** ఐటీ కారిడార్‌లోని మాధాపూర్‌లో చెరువును మాయం చేయాలనే కబ్జాదదారుల ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ సర్వే నంబరు 7లో ఉన్న 6.05 ఎకరాల ఈదులకుంటను కబ్జాల చెర నుంచి విడిపించింది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడి కుంట నిండితే వరద కాలువ ద్వారా ఈదుల కుంటకు నీరు చేరేది. ఆ



కాలువను డైవర్ట్ చేయడంతో ఈదుల కుంటకు వరద నీరు చేరకుండా చేశారు. చెరువు రూపురేఖలు మార్చేసి.. హద్దులు చెరిపేసి... ఇక భవన నిర్మాణాలే ఆలస్యం అనుకున్న తరుణంలో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. తమ్మిడికుంట - ఈదులకుంట- సున్నం చెరువులుగా గొలుసుకట్టుగా ఉన్న వాటిలో ఈదుల కుంట మాయమౌతోందని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసు నమోదయ్యింది. స్థానికుల ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీ లించిన హైడ్రాకు అక్కడ చెరువు ఆనవాళ్లు కనిపించాయి. గ్రామ, రెవెన్యూ రికార్డుల మేరకు 6.05 ఎకరాల చెరువున్నట్టు నిర్ధారించుకుంది. ఇదే విషయాన్ని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాలు కూడా నిర్ధారించాయి. దీంతో మంగళవారం చెరువు హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేసింది. 6.05 ఎకరాల ఈదులకుంటకు తోడు.. ఆ పక్కనే సర్వే నంబరు 11/37లో ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది. మొత్తం 11.21 ఎకరాల భూమిని కాపాడినట్టు అయ్యింది. ఇలా మొత్తం మాధాపూర్‌లోనే దాదాపు రూ. 1800 కోట్ల విలువైన భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. ఈ భూమి చుట్టూ హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేస్తోంది.

## పని ప్రదేశాల్లో మహిళలు జాగ్రత్త వహించాలి

- మహిళల అభివృద్ధి కోసం అనేక ప్రభుత్వ పథకాలు



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ సమక్షంలో మెప్మా పట్టణ స్థాయి సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పని ప్రదేశంలో లైంగిక వేధిం పుల నివారణ గురించి మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు వివిధ రకాల మహిళ అభివృద్ధి పథకాలు గురించి తెలియ చేశారు. మహిళా తోడ్పాటుకు, స్వయం సహకార సంఘాల అభివృద్ధికి కోరకు టీఎల్ఎఫ్ ఎన్నికలను నిర్వహించి, అధ్యక్షురా లు కె.శ్రీలత, కార్యదర్శి ఆర్.సుజాత, కోశాధికారి టి.నాగమణి ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ టేకుల సుదర్శన్ రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టిఎంసి, ఆర్.పి లు, ఎస్.ఎహ్.జి మహిళలు పాల్గొన్నారు.

## శరవేగంగా కొనసాగుతున్న శంకుస్థాపన పనులు



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడ ప్రాంతంలోఅంతర్జాతీయప్రమాణాలతోఏర్పాటుచేస్తున్న సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమానికి జూన్ 3న తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డివస్తున్న సందర్భంగా పనులను దగ్గరుండి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, పాలకవర్గం, అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కోహెడ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నూతన సమీకృత మార్కెట్ వస్తుండడంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సిహెజ్ భాస్కర చారి,సభ్యులు గణేష్ నాయక్,మధుసూదన్ రావు, అంజయ్య,నవరాజ్,రఘుపతి రెడ్డి,నర్సింహ, లక్ష్మి, వెంకటేశ్వర్లు గుప్తా మార్కెట్ కార్యదర్శి ఎల్.శ్రీనివాస్ మార్కెటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**మెట్రో న్యూస్ కడ్తాల్ :** తెలంగాణ రాష్ట్రంలో వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి డిమాండ్ చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏలు) చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆయన బుధవారం హాజరై, వారికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీఓఏలు ఎంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయడం సరికాదన్నారు. వీఓఏల వేతనాలు 20,000 వరకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జిఓ నెం:58 కి సవరణలు చేయాలని మరియు గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివోఏలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కవిత, మండల ప్రధాన కార్యదర్శి ప్రమీల,మండల




జ్యోతి, వివోఏలు చంద్రశేఖర్,వినోద్,లావణ్య, వనిత, శైలజా, మండల పరిధిలోని వీఓఏలు, నాయకులు మాదారం గణేష్ గౌడ్ గుర్లకుంట రవి నాయక్, గురిగల్ల రామచంద్రయ్య,కోసిక యాదయ్య,ముస్లి మహేష్, సిద్దిగారి వెంకటేష్,మాధారం మహేష్ గౌడ్,గుడెపు మహేష్,జర్పుల పాండు నాయక్,రాజు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# శ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయాన్ని అభివృద్ధి చేసుకుందాం


- దేవాలయం ముందున్న ప్లాటు కొనుగోలు చేసి దేవాలయానికి విరాళం

**మెట్రో న్యూస్ షాద్ నగర్:** శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని స్వచ్ఛందంగా దేవాలయ కమిటీ సభ్యులు షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 21, 22 వార్డు భగత్ సింగ్ కాలనీలో లోని శ్రీ కట్ట మైసమ్మ పోచమ్మ తల్లి గుడి ఎదురుగా ఉన్న ప్లాటు కొనుగోలు కోసం భక్తులు,దాతలు విశేషంగా ముందుకొచ్చారు. గుడి అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న విరాళాల సేకరణదేవాలయం ముందున్న ప్లాటును కొనుగోలు చేసి దేవాలయానికి విరాళంగా ఇవ్వడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే విరాళం ఇచ్చిన వారిలో నల్లమోనిబిక్షపతిఒకలక్షరూపాయలు,టీయూడబ్ల్యూజే (ఐజేయు)



తాలూకా సంయుక్త కార్యదర్శి సీనియర్ జర్నలిస్టు అల్వాల దర్శన్ గౌడ్

ఒక లక్ష.పదివేల రూపాయలు,రోమియో రమేష్ ఒక లక్ష రూపాయలు అందజేశారు కార్యక్రమంలో దాతలు ఉదారంగా విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా కట్ట మైసమ్మ గుడి కమిటీ అధ్యక్షులు నల్లమోని శ్రీధర్ మాట్లాడుతూ. అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం అందించిన ప్రతి రూపాయి పవిత్ర సేవ. దాతలు చేసిన ఈ ధర్మకార్యానికి కట్ట మైసమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా వారి కుటుంబాలపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని గుడి కమిటీ అధ్యక్షులు నల్లమోని శ్రీధర్ తెలిపారు గుడి అభివృద్ధి కోసం భక్తులు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. దాతల సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయిని బ్రహ్మ పట్టణ అధ్యక్షులు రోమియో రమేష్. మంచిరాల సురేష్, శ్రీకాంత్, అజయ్. తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ, తెలంగాణకు వర్షసూచన

భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఉపశమనం కలిగిస్తూ ఏపీ, తెలంగాణల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా బుధ, గురువారాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ప్రస్తుతానికి మెజారిటీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతుండటం గమనార్హం.

మంగళవారం అర్ధరాత్రి భాగ్యనగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన వాన బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. కాగా, బుధవారం కూడా నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు భానుడి ప్రతాపం కొనసాగుతుండగానే మరోవైపు ఆకస్మిక వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే ప్రమాదం ఉన్నందున పిడుగుల బారిన పడకుండా ఉండేందుకు ఎవరూ చెట్ల కింద, కరెంట్ స్తంభాలు లేదా పాత హోర్డింగ్స్ వద్ద ఆశ్రయం పొందవద్దని సూచించింది. వాతావరణ తీవ్రతను బట్టి రాష్ట్రంలోని 6 జిల్లాలకు రెడ్ అలర్ట్, మరో 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

# విజన్ పాలిటిక్స్‌కు టీడీపీ నాంది




## మహానాడులో సీఎం

# చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

అమరావతి, మే 27: విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు (AP CM Chandrababu Naidu) వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. ఈరోజు (బుధవారం) మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు

1875 క్లస్టర్‌ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈక్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు.

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలిచింది. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసే నా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తున్నాయి. బెస్ట్ టెక్నాలజీ ప్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువతకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మహానాడు లో కీలక ప్రకటన



తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక పండుగ 'మహానాడు' వేదికగా ఒక అరుదైన, చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. ఈ రోజు మహానాడు సభలో తాను ఒక బిగ్ అనౌన్స్‌మెంట్ (కీలక ప్రకటన) చేయబోతున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారికంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. పార్టీలో అత్యంత కీలకమైన బాధ్యతలను స్వీకరించిన తర్వాత.. ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తాను తొలిసారి పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పరిణామంతో తెలుగు రాష్ట్రాల్లోని టీడీపీ నాయకులు, క్షేత్రస్థాయి కార్యకర్తలలో ఒక్కసారిగా ఉత్కంఠతో పాటు భారీ అంచనాలు పెరిగిపోయాయి.

మహానాడు వేదికగా నారా లోకేష్ చేయబోయే ఆ పెద్ద ప్రకటన ఏంటనే దానిపై రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చ నడుస్తోంది. "నా నుంచి రాబోయే ఆ బిగ్ అనౌన్స్‌మెంట్ కోసం కాస్త వేచి చూడండి" అంటూ ఆయన చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. పార్టీ యువనేతగా, ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన లోకేష్.. రాబోయే రోజుల్లో పార్టీ సంస్థాగత నిర్మాణంలో తీసుకోబోయే విప్లవాత్మక మార్పుల గురించా, యువతకు ఇచ్చే ప్రాధాన్యత గురించా లేదా ఏపీ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ఏదైనా సరికొత్త విధానాన్ని ప్రకటించబోతున్నారా అనేది ఉత్కంఠగా మారింది. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన చేయబోయే ప్రసంగం టీడీపీ భవిష్యత్తు రాజకీయ దిశను నిర్దేశించనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం

అమరావతి: స్థానిక ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని తెదేపా అధినేత చంద్రబాబు (Chandrababu) ఆదేశించారు. ఏ ఎన్నికలైనా గెలుపే ప్రధానమని స్పష్టంచేశారు. గెలుపే ధ్యేయంగా నేతలు, కార్యకర్తలు పని చేయాలి, ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎవరూ ఇగోలకు వెళ్లొద్దని చంద్రబాబు హితవు పలికారు. మిత్ర పలతో సఖ్యతతో, సమన్వయంతో ముందుకు వెళ్లామని దిశానిర్దేశంచేశారు. 2024 ఎన్నికల్లో సాధించిన విజయం మళ్లీ రిపీట్ అయ్యేలా అందరం మమేకం అవుదామన్నారు. స్పెషల్ రివిజన్ లో భాగంగా ఓట్ల నమోదు విషయంలో లీడర్లు, కేడర్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలుగుదేశం బలం బలగం కేడర్ అన్న చంద్రబాబు.. ఏదైనా పార్టీ ఫస్ట్, కేడరే ముందని తెలిపారు. నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఇక్కడ చదువుకున్న, శిక్షణ పొందిన నాయకులే అన్ని చోట్లా రాణిస్తున్నారని గుర్తుచేశారు. సోషల్ రీ ఇంజినీరింగ్ చేయటమే పార్టీ విధానమని తెలిపారు. అందరికీ అవకాశాలు కల్పించటమే పార్టీ లక్ష్యమని తెలిపారు. పార్టీ అధినేతగా.. పార్టీ కుటుంబసభ్యులైన కార్యకర్తల ఎంపవర్మెంట్ కోసం నిరంతరం పనిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.


# ఏఐ వైద్యంలో ఏపీ నంబర్ వన్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏఐ ఆధారిత వైద్యసేవలు అందించడంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. వైద్య రంగంలో అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగించడం ద్వారా రోగులకు మెరుగైన చికిత్సలు అందించడంలో ఏపీ ప్రభుత్వం ఆదర్శంగా మారింది. ఈ విషయాన్ని నేషనల్ హెల్త్ అథారిటీ జాయింట్ సెక్రటరీ కిరణ్ గోపాల్ మంగళగిరిలో జరిగిన ఒక ప్రత్యేక సదస్సులో వెల్లడించారు. జాతీయ స్థాయిలో ఏపీ ప్రభుత్వం చేపట్టిన ఈ ఇన్నోవేషన్లు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

వైద్య రంగాన్ని డిజిటలైజ్ చేయడంలో ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. దేశ వ్యాప్తంగా సృష్టించిన వంద కోట్ల అభా ఐడీలలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక వాటాను కలిగి ఉంది. చికిత్సలకు సంబంధించిన సమాచారం, రోగుల ఆరోగ్య రికార్డులను పక్కాగా సేకరించడం వల్ల కృత్రిమ మేధస్సు సరిగ్గా పనిచేస్తుంది. రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించడానికి ఈ విశ్వసనీయ డేటా ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

# ఎబోలా పరీక్షలు





ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ కేసులు, మరణాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. అందులో భాగంగా మంగళవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కేంద్రపౌర విమానయాన శాఖ ఆదేశాల మేరకు విదేశీ ప్రయాణికులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం సింగపూర్ నుంచి తరలివచ్చిన ప్రయాణికులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది ఎబోలా వైరస్ పరీక్షలు చేపట్టారు. తొలిరోజు మొత్తం 185 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య అధికారి డాక్టర్ సృజన తెలిపారు. ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు.

# అమరావతి నిర్మాణ పనులపై క్లారిటీ

రాజధాని అమరావతి నిర్మాణంపై వైసిపి నేతలు చేస్తున్న విమర్శలపై మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అమరావతి పరిధిలో శరవేగంగా జరుగుతున్న అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్స్, అధికారుల నివాస భవనాల నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, తెలంగాణ సచివాలయం, అసెంబ్లీ నిర్మాణ వ్యయాలపై వైసిపి నేతలు తప్పుడు లెక్కలు చెబుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే మాట్లాడితే గత ఎన్నికల్లో వచ్చిన 11 సీట్లు కూడా భవిష్యత్తులో సున్నా అవ్వడం ఖాయమని హెచ్చరించారు. జనాలు నవ్వుకుంటున్నామావిగన్"ను పట్టుకుని వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

అమరావతి కోసం 30,760 మంది రైతులు 35,059 ఎకరాల భూమిని ఇచ్చారని, వారిలో 30,079 మందికి ఇప్పటికే ప్లాట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. ఆల్ ఇండియా సర్వీస్ అధికారుల కోసం నిర్మిస్తున్న నివాస భవనాలను జూన్ నెల నుండి దశలవారీగా జిఏడికి అప్పగిస్తామన్నారు. ఖర్చుల వివరాలను వెల్లడిస్తూ హైదరాబాద్ సచివాలయానికి చదరపు అడుగుకు రూ. 13,768, కొత్త పార్లమెంట్కు రూ. 16,916 వ్యయం అవ్వగా,




అమరావతి ఐకానిక్ టవర్స్కు రూ. 15,000 నుండి రూ. 16,000 వరకు ఖర్చవుతుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అమరావతి ద్వారా ఏటా రూ. 12 వేల కోట్ల ఆదాయం వస్తుందని, ఇక్కడి మిగులు భూములతోనే తీసుకున్న రుణాలను తీర్చగలమని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు.

# ముఖం మెరిసేందుకు



చర్మాన్ని మెరిసేలా ఉంచుకోవడానికి చాలా మంది మహిళలు తమ స్కిన్ కేర్ రొటీన్‌లో విటమిన్ ఈ నూనె లేదా క్యాప్సూల్స్‌ను ఉపయోగిస్తుంటారు. విటమిన్ ఈలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాలుష్యం, ఎండలోని హానికర కిరణాలు, ఫ్రీ రాడికల్స్ ప్రభావం నుంచి రక్షించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే చర్మానికి తేమను అందించి పొడిబారకుండా కాపాడుతాయని సూచిస్తున్నారు.

అయితే విటమిన్ ఈ నూనె చాలా మందంగా, జిడ్డుగా ఉండటం వల్ల కొంతమందికి చర్మ రంధ్రాలు మూసుకుపోయే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా జిడ్డు చర్మం లేదా మొటిమల సమస్య ఉన్నవారు దీనిని నేరుగా వాడితే మొటిమలు పెరగడం, చర్మం చికాకుగా మారడం వంటి సమస్యలు రావచ్చు.


విటమిన్ ఇ క్యాప్సూల్ లోని నూనెను నేరుగా ముఖానికి పట్టించుకోవచ్చు. రాత్రి పడుకునే ముందు రాసుకుని, ఉదయం గోరువెచ్చని నీటితో కడిగితే ఉత్తమ ఫలితాలు ఉంటాయి. దీనిని నేరుగా లేదా మాయిశ్చరైజర్‌లో కలిపి వాడవచ్చు. అంతేకాకుండా, విటమిన్ ఈ సీరమ్‌ను కూడా ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సీరమ్ తేలికగా ఉండి చర్మంలో సులభంగా కలిసిపోతుంది.

విటమిన్ ఈ చర్మానికి తేమను అందించి కొంతవరకు మచ్చలను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే లోతైన మచ్చలను పూర్తిగా తొలగించాలంటే నిపుణుల సలహా అవసరం. విటమిన్ ఈను రోజుకు ఒకటి లేదా రెండు సార్లు వాడొచ్చు. ముఖ్యంగా రాత్రి సమయంలో రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. పగటిపూట వాడితే తప్పనిసరిగా సన్‌స్క్రీన్ కూడా ఉపయోగించాలి.



# క్యారట్‌తో మెరిసే చర్మం..!

క్యారట్.. ఆరోగ్యానికే కాదు.. సౌందర్య సంరక్షణలోనూ ఎంతగానో ఉపకరిస్తుంది. వీటితో వార్ధక్యాన్ని నివారించే, చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చే రకరకాల ఫేస్ ప్యాక్స్, మాస్క్ కూడా చేసుకోవచ్చు.



ఇన్ని మంచి సుగుణాలు క్యారట్ సొంతం కాబట్టే చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. పైగా ఇంట్లో సులభంగా లభించేదే కాబట్టి అందుబాటు బడ్జెట్లోనే కాంతులీనే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

మేకప్కి ముందు!

మనం వేసుకునే మేకప్ ఎక్కువ సమయం నిలిచి ఉండాలంటే చర్మంలో తేమ శాతం బాగుండాలి. అందుకే మేకప్ వేసుకోవడానికి ముందు అరటేబుల్ స్పూన్ క్యారట్ జ్యూస్ కి, అరటేబుల్ స్పూన్ కమలారసం జత చేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో ముఖానికి 10 నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. తర్వాత నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేసిన తర్వాత మేకప్ వేసుకుంటే ఆ ప్రభావం ఎక్కువసేపు కనిపిస్తుందని చెబుతున్నారు నిపుణులు.



# ప్రయాణంలో ఈ ఫుడ్స్ తింటే డేంజర్

లాంగ్ డ్రైవ్స్, వీకెండ్ ట్రిప్స్ ఇప్పుడు చాలా మందికి సాధారణంగా మారిపోయాయి. ముఖ్యంగా హైవేల వెంట కనిపించే ధాబాలు, ఫుడ్ స్టాల్స్ వద్ద ఆగి తినడం చాలామందికి ఇష్టం. అయితే, ప్రయాణ సమయంలో ఏది పడితే అది తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా హైవేలపై దొరికే కొన్ని ఆహార పదార్థాలు జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్, అలసటకు కారణమవుతాయని చెబుతున్నారు. అందుకే హైవే జర్నీల్లో కొన్ని ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎక్కువ నూనె, మసాలా ఉన్న ఆహారం

హైవే పక్కన దొరికే పకోడీలు, సమోసాలు, ఫ్రై ఐటమ్స్, మసాలా కర్రీలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ ఇవి అధిక నూనెతో తయారవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. ఫలితంగా కడుపు ఉబ్బరం, అసిడిటీ,అలసట వంటి సమస్యలు వస్తాయి. డ్రైవింగ్ చేస్తున్నవారికి నిద్రమత్తు కూడా కలిగే ప్రమాదం ఉంది.

కట్ చేసిన పండ్లు తినేటప్పుడు జాగ్రత్త

రోడ్డు పక్కన ముందుగానే కట్ చేసి ఉంచిన పండ్లు బయట దుమ్ము, కాలుష్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. శుభ్రత లేకపోతే బ్యాక్టీరియా పెరిగి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే తొక్క తీసి తినే పండ్లు లేదా సీల్ చేసిన ప్యాక్డ్ ఫ్రూట్స్ ఎంచుకోవడం మంచిది.

చల్లని డ్రింక్స్ కంటే నీళ్లు మంచివి

కూల్ డ్రింక్స్, సోడాలు తాగితే కొద్దిసేపు ఫ్రెష్‌గా అనిపించినా, తర్వాత శరీరంలో నీరసం పెరిగే అవకాశం ఉంటుంది. వీటిలో చక్కెర అధికంగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ సమస్య కూడా రావచ్చు. అందుకే సాధారణ నీరు, కొబ్బరి నీరు లేదా ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోవడం ఆరోగ్యానికి మేలు.

డైరీ ఉత్పత్తులు

లస్సీ, మజ్జిగ, పనీర్ వంటి పదార్థాలు ఎండాకాలంలో త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయకపోతే ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి శుభ్రత ఉన్న ప్రదేశాల్లో మాత్రమే ఇలాంటి ఆహారం తీసుకోవాలి.

మళ్లీ వేడి చేసిన ఆహారం

కొన్ని హోటళ్లలో ముందే తయారు చేసిన ఆహారాన్ని మళ్లీ మళ్లీ వేడి చేసి అందిస్తుంటారు. ఇలా చేసిన ఆహారంలో హానికరమైన బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే తాజాగా వండిన వేడి ఆహారాన్ని తక్కువ పరిమాణంలో తీసుకోవడం ఉత్తమం.

తక్కువగా తింటేనే మేలు

ప్రయాణ సమయంలో అతిగా తినడం వల్ల అలసట, నిద్రమత్తు పెరిగి డ్రైవింగ్‌పై ప్రభావం పడుతుంది. లైట్ ఫుడ్, డ్రై ఫ్రూట్స్, పండ్లు, నీరు వంటి వాటిని తీసుకుంటే శరీరం ఉత్సాహంగా ఉంటుంది.


మెట్రో




# గుమ్మడి గింజల ఆరోగ్య ప్రయోజనాలు

నట్స్ అందరికీ మేలు చేసే ఆహారంగా మారింది. అందులో గుమ్మడి గింజలు ప్రధానమైనవి. వీటిలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. వీటి ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. గుమ్మడి గింజల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గుమ్మడి గింజలు మొక్క ఆధారిత ప్రోటీన్ ను మనకు అందిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల వెన్నెముక బలంగా తయారవ్వడంతో పాటు కండరాల మరమ్మత్తు కూడా సక్రమంగా జరుగుతుంది. అయితే వీటిని అధికంగా తీసుకుంటే మాత్రం కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వీటిని ఎక్కువగా ఎవరు తినకూడదు వంటి విషయాలపై నిపుణులు స్పష్టత ఇస్తున్నారు.గుమ్మడికాయ గింజలు అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన పోషకాలను ఇచ్చే మంచి ఆహారం. ఇక గుమ్మడి గింజలను నేరుగా స్నాక్స్ గా తినవచ్చు. సలాడ్లలో కూడా వీటిని కలుపుకొని తీసుకోవచ్చు. ఇక సూప్ లలో కూడా గుమ్మడి గింజలు వేసుకొని తినవచ్చు. స్మూతీస్ లో కూడా గుమ్మడి గింజలను తీసుకోవచ్చు. గుమ్మడి గింజలను రోజు ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల గుమ్మడి గింజల్లో ఉండే పోషకాలు మన శరీర ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. గుమ్మడి గింజలలో సంవృద్ధిగా ఉండే పోషకాలు ఇవే గుమ్మడి గింజలలో మోనో అన్ శాచ్యురేటెడ్, పాలి అన్ శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ కే, విటమిన్ ఈ, విటమిన్ బి కాంప్లెక్స్ గుమ్మడి గింజలలో లభిస్తాయి. మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్, కాపర్ వంటి ఖనిజాలు గుమ్మడి గింజల్లో సమృద్ధిగా ఉంటాయి. గుమ్మడి గింజలు శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించే యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి.






# జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి మజ్జిగ దివ్యౌషధం

పాలు, పెరుగు, వెన్న, నెయ్యి ఇలా పాల పదార్థాలేవైనా కావాల్సినన్ని పోషకాలు అందిస్తాయి.కానీ, వాటన్నింటిలో మజ్జిగ ఇచ్చే ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయట. ఎండల్లో జావ,కొబ్బరినీళ్లు, పండ్లరసాల్లాంటివి ఎంతో మేలు చేస్తాయని తెలిసిందే. అయితే, మజ్జిగ ప్రత్యేకతే వేరు. ఇది చల్లచల్లగా దాహం తీరుస్తూనే, నిమిషాల్లో నిస్సత్తువను మాయం చేస్తుందంటున్నారు.బెస్ట్ రీ హైడ్రేట్ డ్రింక్ గా పేరున్న మజ్జిగ నేచురల్ కూలింగ్ ఫుడ్‌గానూ పేరొందింది. దీంట్లో బి12 విటమిన్, పొటాషియం, క్యాల్షియం, ప్రొటీన్లు అధిక మొత్తంలో ఉంటాయి.జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి మజ్జిగ దివ్యౌషధంలా పనిచేస్తుందట. ఇందులోని లాక్టోబాసిల్లస్ బ్యాక్టీరియా పొట్ట ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటివి చాలా వరకూ తగ్గుతాయంటున్నారు. అంతేకాదు, పెద్దపేగు క్యాన్సర్, స్టమక్ ఇన్‌ఫెక్షన్లు దరిచేరవని పలు అధ్యయనాల్లో తేలింది.మజ్జిగ తాగడం వల్ల పొట్టలోని హానికరమైన వైరస్, బ్యాక్టీరియాలతో పాటు ఇతర వ్యర్థాలూ శరీరం నుంచి తొలగిపోతాయి. దీని వల్ల లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. బీపీలో తేడా ఉన్నవాళ్లు ఉప్పు లేకుండా మజ్జిగని తీసుకోవడం చాలా మంచిదని పరిశోధనల్లోనూ తేలింది. మజ్జిగ తీసుకోవడం సిస్టోలిక్ రక్తపోటు, సగటు ధమనుల రక్తపోటును గణనీయంగా తగ్గించిందని ంఎఆవఅఎవసఅతీవష్ పేర్కొంది.వేసవిలో చెమట రూపంలో బాడీ నుంచి నీరు, ముఖ్యమైన ఖనిజ లవణాలు బయటకు వెళ్లిపోతాయి.

# పొగాకు,మద్యం మానేస్తే - 50శాతం క్యాన్సర్లకు చెక్!

ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను క్యాన్సర్ భయపెడుతూనే ఉంది. ఈ విషయంలో మనమేమీ చేయలేమనే భావిస్తుంటారు. కానీ, దీని బారినపడటాన్ని తగ్గించుకోవటానికి చాలా మార్గాలే ఉన్నాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా పది క్యాన్సర్ కేసులలో నాలుగు వరకు నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔమా) తాజా అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా, పొగాకు, మద్యానికి దూరంగా ఉంటే సుమారు 50 శాతం క్యాన్సర్లను నివారించుకోవచ్చుట. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

క్యాన్సర్లకు ఆహార అలవాట్లు, జన్యు స్వభావం నుంచి పర్యావరణ కాలుష్యం వరకూ రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. మనం జన్యు స్వభావాన్ని మార్చలేం కానీ, జీవనశైలిని మార్చుకోవచ్చు. అలాగే, కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు. ఇలాంటి జాగ్రత్తలతో చాలా వరకూ క్యాన్సర్ బారినపడకుండా చూసుకోవచ్చు. ఇదే విషయాన్ని తాజా అధ్యయనం మరోసారి నొక్కి చెప్పింది. ఈ క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా 2022లో మొత్తం 1.87 కోట్ల కొత్త క్యాన్సర్లు నమోదు కాగా, 71 లక్షల క్యాన్సర్లు మార్చుకోదగిన 30 కారకాలతో ముడిపడి ఉందని పేర్కొంది. నివారించుకోదగిన క్యాన్సర్లలో దాదాపు సగం జీర్ణాశయ, ఊపిరితిత్తి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లేనట. అయితే, మార్చుకోదగిన ముప్పు కారకాల్లో బీడీలు, చుట్టలు, సిగరెట్లు కాల్చటం, మద్యం తాగటం, శరీర ఎత్తు, బరువు నిష్పత్తి (దీవీ×), తగినంత శారీరక శ్రమ లేకపోవడం, గుట్కా, జర్దా వంటి పొగాకు ఉత్పత్తులు నమలటం, వక్కపొడి తినటం, మహిళలు తమ పిల్లలకు తగినన్ని రోజులు చనుబాలు పట్టకపోవటం, గాలి కాలుష్యం, యూవీ కిరణాల ప్రభావం,



ఇన్ ఫెక్షన్ కారకాలు, పనిచేసే చోట్ల రసాయనాల ప్రభావం వంటివి ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు.ప్రధానమైనవి పొగాకు, మద్యమే : జీవనశైలి పరంగా మార్చుకోదగిన క్యాన్సర్ ముప్పు కారకాల్లో పొగాకు, మద్యం అలవాట్లే ముందుంటాయి. 2022లో నమోదైన క్యాన్సర్లలో 15 శాతం పొగ తాగటంతోనే ముడిపడి ఉన్నాయట. ముఖ్యంగా, పురుషులకు ఇది ఎక్కువ ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ఆ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా నిర్ధారణ అయిన కొత్త క్యాన్సర్లలో 23 శాతం కేసులకు పొగ తాగటమే ప్రధాన కారణమని తేలింది. ఇదొక్కటే కాదు, గాలి కాలుష్యమూ కూడా ఇందులో భాగమట. కాకపోతే, ఈ సమస్య ప్రాంతాల వారిగా మారిపోతోంది. అలాగే, ప్రవర్తన పరంగా తర్వాత స్థానం మద్యానిదే. నివారించుకోదగ్గ క్యాన్సర్లకు ఈ రెండే దాదాపు 48 శాతం వరకూ కారణమవుతున్నాయని పరిశోధకులు పేర్కొంటున్నారు.

మెట్రో ఈవినింగ్స్ సినిమా




# 'సాతాన్ ది డార్క్' మూవీ రివ్యూ




# నాయికా ప్రాధాన్య చిత్రంలో మమి



ప్రేమలు సినిమాతో యువతరాన్ని తన ప్రేమ మాయలో పడేసింది మమితా బైజు. త్వరలో ఆమె విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్ లాంటి భారీ చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఇప్పుడామె తన తొలి నాయికా ప్రాధాన్య చిత్రాన్ని పట్టాలెక్కించినట్లు సమాచారం. లవ్‌డే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన యువ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ చిత్రంతో నిర్మాతగా మారుతున్నట్లు తెలిసింది. ఆయన వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన కుర్రాడు దీనికి దర్శకత్వం వహించనుండగా.. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఇటీవలే చెన్నైలో లాంఛనంగా మొదలైందని.. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సమాచారం.






# పోలీస్‌గా ప్రభాస్ యాక్షన్ షురూ






# సునీల్ సంచలన వ్యాఖ్యలు

హాస్యనటుడిగా వెండితెరకు పరిచయమై.. ఆ తర్వాత హీరోగా, విలన్‌గా వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న నటుడు సునీల్ తన సినీ ప్రయాణంపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అల్లు అర్జున్ - సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప' సినిమాలో 'మంగళం శ్రీను' పాత్రకు తను ఎంపికవడం ఒక పెద్ద షాక్ అని ఆయన అన్నారు. ఆ నెగెటివ్ క్యారెక్టర్ తన కెరీర్‌ను పూర్తిగా మలుపు తిప్పిందని, ప్రస్తుతం అన్ని భాషల చిత్ర పరిశ్రమల నుంచి వరుస అవకాశాలు తెచ్చిపెడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

# CSK కోచ్‌గా ఎంఎస్ ధోనీ?

సీఎస్కేను 5 సార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిపిన లెజెండరీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తుపై ఆ జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ సంచలన ప్రకటన చేశారు. మోకాలి గాయం కారణంగా ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్లో ఒక్క మ్యాచ్‌లో కూడా స్టేడియంలోకి దిగలేకపోయాడు. దీంతో ధోనీ ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు జోరందుకున్న తరుణంలో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ.. ధోనీ జట్టులో ఏ పాత్రలో ఉండాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది పూర్తిగా ధోనీ వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.

**ధోనీ ఏ పాత్రలో ఉన్నా ఓకే..!**

ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ధోనీ సీఎస్కే జట్టులోనే శాశ్వతంగా కొనసాగాలని తాము కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఃఃధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మేము సంతోషిస్తాం. ధోనీ ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా ఆయన ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది. అని సీఈఓ పేర్కొన్నారు. ధోనీ అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించనప్పటికీ.. వచ్చే సీజన్ నాటికి ఎంఎస్ ధోనీ సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే ఊహాగానాలకు ఈ కామెంట్స్ మరింత బలాన్ని చేకూర్చాయి.

**రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీపై సీఈఓ పూర్తి భరోసా**

ధోనీ తర్వాత సీఎస్కే సారథ్య బాధ్యతలు చేపట్టిన రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీపై వస్తున్న విమర్శలకు కాశీ విశ్వనాథన్ అడ్డుకట్ట వేశారు. ఃఃరుతురాజ్ దాదాపు మూడు, నాలుగు ఏళ్ల పాటు ధోనీని చాలా దగ్గరగా గమనించిన తర్వాతే కెప్టెన్సీని అందుకున్నాడు. ఎంఎస్ ధోనీ, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు రుతురాజ్‌ను ఎంతో ప్రశాంతంగా ఉండే కెప్టెన్‌గా తీర్చిదిద్దారు. రాబోయే రోజుల్లో సీఎస్కేలోకి వచ్చే యువ క్రికెటర్లలో కూడా రుతురాజ్ ఇదే నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాడనే పూర్తి నమ్మకం మాకుందిః అని ఆయన వెల్లడించారు.

**ఐపీఎల్ 2026లో నిరాశపరిచిన సీఎస్కే**

ఈ ఐపీఎల్ 2026 సీజన్‌లో సీఎస్కే ప్రదర్శన అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ధోనీ మైదానంలో లేకపోవడం జట్టుపై స్పష్టమైన ప్రభావాన్ని చూపింది. లీగ్ దశలో ఆడిన 14 మ్యాచ్‌లలో సీఎస్కే కేవలం 6 మ్యాచ్‌లలో మాత్రమే విజయం సాధించి, 12 పాయింట్లతో పట్టికలో 8వ స్థానానికి పరిమితమై ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకుంది. సీజన్ మధ్యలో జట్టు పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో లీగ్ దశలోనే సీఎస్కే ప్రయాణం ముగిసింది.



## మెట్రో స్పోర్ట్స్


# ఆర్సీబీ విజయ రహస్యం అదే భువనేశ్వర్

హైదరాబాద్ : ఐపీఎల్ 2026 సీజన్‌లో స్వింగ్ కింగ్, టీమిండియా పేసర్ భువనేశ్వర్ కుమార్(Bhuvneshwar Kumar) అదరగొడుతున్నాడు. అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ఫర్‌పుల్ క్యాపు రేసులో దూసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో క్వాలిఫయర్1లో గుజరాత్ టైటాన్స్ (GT) పై ఆర్సీబీ(RCB) జట్టు విజయం సాధించిన అనంతరం తమ జట్టు విజయ రహస్యలను, బౌలింగ్ ప్రణాళికల గురించి తన అనుభవాలను పంచుకున్నాడు. జట్టు విజయాలలో గణాంకాల (Data) పాత్ర ఉందన్నారు.

అయితే దానిపైనే 100 శాతం ఆధారపడబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఆడే ఆటగాళ్లు ఏదైనా కొత్త ప్రయోగాలు చేసినప్పుడు, వారి డేటాను నిశితంగా పరిశీలిస్తామని భువీ పేర్కొన్నారు. ప్రత్యర్థి బ్యాటర్లను భారీ షాట్లు ఆడకుండా కట్టడం చేయడం, ఎల్‌బీడబ్ల్యూ లేదా బౌల్డ్ చేయడంపై దృష్టి పెడుతామని పేర్కొన్నారు. మా అనుభవం (భువీ, జోష్ హేజిల్‌వుడ్) కూడా జట్టుకు ఉపయోగపడుతుందన్నారు. సహాయక సిబ్బంది వారు అందిస్తున్న చిన్న చిన్న మెళకువలు మాకు బాగా కలిసివస్తున్నాయి.

ఆర్సీబీ వరుసగా రెండోసారి ఫైనల్స్‌కు చేరుకోవడంతో తెరవెనుక పనిచేసిన సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కాగా, భువనేశ్వర్ ఈ సీజన్‌లో 15 మ్యాచ్‌లలో 18.15 సగటుతో, 8.00 ఎకానమీ రేటుతో 26 వికెట్లు పడగొట్టాడు. అతని అత్యుత్తమ గణాంకాలు 4/23. ఆర్సీబీ ఐపీఎల్ ఫైనల్స్‌కు చేరడం ఇది5వ సారి. ముంబై ఇండియన్స్ (6 సార్లు ఫైనల్స్‌కు చేరి, 5సార్లు టైటిల్ గెలుచుకుంది). చెన్నై సూపర్ కింగ్స్ (10 సార్లు ఫైనల్స్‌కు చేరి,5సార్లు టైటిల్ గెలుచుకుంది).



# హిస్టరీలోనే ఇలాంటి అవుట్ ఎప్పుడూ చూసుండరు..

క్రికెట్‌లో బ్యాడ్ లక్ అనేది ఏ రేంజ్‌లో ఉంటుందో ఐపీఎల్ 2026 క్వాలిఫయర్-1 మ్యాచ్ చూపించింది. ధర్మశాల స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), గుజరాత్ టైటాన్స్ (GT) మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో ఒక విచిత్రమైన సీన్ రిపీట్ అయింది.

గుజరాత్ స్టార్ ఓపెనర్, ఈ సీజన్ ఆరెంజ్ క్యాప్ రేసులో దూసుకుపోతున్న సాయి సుదర్శన్ అవుటైన తీరు చూసి అభిమానులు అందరూ షాకయ్యారు. అదృష్టం కలిసొస్తే ఓకే కానీ, దురదృష్టం వెంటాడితే చేతిలో ఉన్న బ్యాట్ కూడా శత్రువులా ఎలా మారుతుందో సాయి సుదర్శన్ విషయంలో ప్రూవ్ అయింది.



Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007